సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 29.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 299
పేజీలు: 08 వెల: రూ. 5

## బీఆర్ఎస్ పోరుబాట
కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై కదం తొక్కనున్న
### గులాబీ దండు
02

- సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ ఆదేశం



## నేపాల్‌కు మరో ప్రళయం!
రసువాలో ఫ్లాష్ ఫ్లడ్స్ హెచ్చరిక! 02

- 469 మంది మృతితో విషాదం..
- నేపాల్‌లో మళ్లీ వరద భయం!
- రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత..
- నేపాల్ ప్రజలకు ఆర్మీ అలర్ట్!



## బీసీ, ఈబీసీలకు గుడ్ న్యూస్
విదేశీ విద్యకు తెలంగాణ సర్కార్ సాయం 02

- 350 మంది విద్యార్థులకు అవకాశం
- సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తులు
- ఈ-పాస్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్
- కుటుంబ ఆదాయం రూ.5 లక్షల్లోపు



## మధ్య ఆసియాపై ఫోకస్
నేటి నుంచి ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్‌లో మోడీ పర్యటన 02

- నాలుగురోజుల పాటు విదేశీ టూర్
- భారత్ కు సత్సంబంధాలు, వాణిజ్య ఇతర అవసరాలపై చర్చలు






## అప్పుల ఊబిలో
# రియల్ కలలు
### మెరుపుల వెనుక కుదేలైన జీవితాలు!

- రూ.5.73 కోట్ల ఆస్తుల వేలం
- కుదేలైన ఖమ్మం రియల్ ఎస్టేట్
- కొనేవారు లేక.. అప్పులు పెరిగాయి..
- వడ్డీల భారంతో విలవిల
- రియల్టర్లకు పంచాయితీల సెగ
- ఇళ్లు కట్టినా.. కొనేవారు కరువు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**
ఒకప్పుడు ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా, ఏ నాలుగు రోడ్ల కూడలిలో నిలబడ్డా వినిపించే ఒకే ఒక్క మాట 'భూమి'. "ఈ రోజు ఎకరం పది లక్షలు పెడితే, రేపు కోటి రూపాయలు అవుతుంది" అనే ఆశల ప్రయాణం ఖమ్మం నుంచి పల్లెల దాకా అందరినీ ఊపేసింది. పచ్చని పొలాలు లేఅవుట్లుగా మారిపోయాయి. గజాల లెక్కన కలల సౌధాలను నిర్మించుకుంటూ, వడ్డీలకు తెచ్చి మరీ కోట్లు కుమ్మరించారు. కానీ, సమయం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగాన్ని చుట్టుముట్టిన మందగమనం, హఠాత్తుగా వచ్చిపడిన పతనం ఇప్పుడు అనేక కుటుంబాలను కోలుకోలేని దెబ్బతీసింది.
ఖమ్మం నగరం తోపాటు పరిసరాల్లోని అర్బన్, రూరల్, రఘునాథపాలెం మండలాల్లో, జిల్లాలోని అనేక పట్టణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఎంతో వేగంగా విస్తరించిన రియల్ వెంచర్లు నేడు కళాహీనంగా మారిపోయాయి. అక్కడ భూములను వ్యాపార నిమిత్తం డెవలప్ చేసి, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిన వ్యాపారులు, ఆ వడ్డీల భారాన్ని తట్టుకోలేక చేతులెత్తేశారు. నగరంలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి నుండి రూ. 5.73 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఆయనకు సంబంధించిన ఆస్తులను బహిరంగ వేలానికి పెట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో ఖమ్మం రియల్ ఎస్టేట్ రంగం ఏ స్థాయిలో కుదేలైందో స్పష్టమవుతోంది. ఒకప్పుడు మార్కెట్‌ను ఏలిన ప్రముఖ రియల్టర్ల ఆస్తులే వేలం పాటల దాకా వచ్చాయంటే, ఈ రంగంలో నెలకొన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి నిదర్శనంగా నిలిచింది.
ఇది కేవలం ఒకరిద్దరి కథ కాదు, రియల్ ఎస్టేట్ నమ్మి రంగంలోకి దిగిన వందలాది మంది వ్యాపారుల నిత్య వేదన, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, భూముల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఇప్పుడు ఆ అప్పుల ఊబిలో దారుణంగా కూరుకుపోయారు. కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడం, భూముల ధరలు దారుణంగా పడిపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక, వ్యాపారాన్ని ముందుకు నడపలేక పోతు న్నారు.

**రియల్ వ్యాపారంలో చిక్కుకొని!**
ఈ సంక్షోభం వెనుక ఎందరో మధ్యతరగతి ప్రజల కన్నీటి గాథలు మిగతా 02లో

# రాఖీతో రాజీ?!
## సీఎంకు బంగారు రాఖీ కట్టిన కొండా

- కూతురి విమర్శల వేళ రేవంత్‌కు రాఖీతో వివాదానికి ముగింపు
- మంత్రి సీతక్కతో కలిసి సీఎం వద్దకు సురేఖ
- క్రమశిక్షణ కమిటీ నివేదిక ముప్పు.. సీఎంతో సురేఖ భేటీ వెనుక అసలు వ్యూహం?
- పార్టీలో వేటు ప్రచారం వేళ అన్న రేవంత్ ఆశీస్సులు కోరిన మంత్రి
- కుటుంబ వివాదాలకు చెక్.. సంప్రదాయం చాటున ఐక్యతా సంకేతం!
- పరకాల వివాదం, క్రమశిక్షణ చర్యలు.. రేవంత్ భరోసాతో సురేఖకు ఊరట?
- మీడియా ప్రశ్నలకు నో కామెంట్స్.. అన్న రేవంత్ ఆశీస్సులు ఉంటాయన్న సురేఖ
- తెలంగాణ కాంగ్రెస్‌లో మారుతున్న సమీకరణాలు



**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ సంబంధాలు, విమర్శలు, సంప్రదాయిక కట్టుబాట్లు ఎప్పుడూ కలగలిసి ఉంటాయి. అయితే గొడవల కారణంగా కొందరు సొంత వాళ్లకు దూరమవుతున్నారు. కొందరు దూరమైనవాళ్లు పండుగలు, వేడుకల వేల దగ్గరవుతున్నారు. కుటుంబ కలహాల కారణంగా టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధినేత కల్వకుంట్ల కవిత సొంత కుటుంబానికి దూరమయ్యారు. రాఖీ సందుగ సందర్భంగా రెండేళ్లుగా కేటీఆర్‌కు రాఖీ కట్టడం లేదు. ఇక తాజాగా తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన మంత్రి కొండా సురేఖ.. రాఖీ పండుగ సందర్భంగా సీఎంకు దగ్గరయ్యారు. శుక్రవారం(ఆగస్టు 28న) మరో మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి రాఖీ కట్టారు. సురేఖ కూతురు సుష్మిత ఇటీవల చేసిన విమర్శల నేపథ్యంలో దీని వెనుక రాజకీయ సంకేతాలున్నాయని చర్చ ఉంది.

**సీఎంపై తీవ్ర విమర్శలు చేసిన సుష్మిత..**
కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిపై ఇటీవల వ్యక్తిగత విమర్శలు చేశారు. పరకాల టికెట్ విషయంలో సీఎం చేసిన ప్రకటనకు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా పరుశ పదజాలంతో చేసిన విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన అటువంటి వ్యాఖ్యలు సాధారణంగా పార్టీ అంతర్గత సంబంధాలపై ప్రభావం చూపుతాయి. అయితే తాజాగా కొండా సురేఖ స్వయంగా సీఎం నివాసానికి వెళ్లి రాఖీ కట్టడం, ఈ విమర్శలకు ఒక విధంగా సమాధానం ఇచ్చినట్టు కనిపిస్తోంది.

**సంప్రదాయం వెనుక రాజకీయం**
రాఖీ పండుగ సోదరి–సోదరుడి మధ్య రక్షణ, స్నేహం, కుటుంబ బంధాన్ని సూచిస్తుంది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ సీఎంకు రాఖీ కట్టడం ఈ సంప్రదాయాన్ని అనుసరించినట్టు కనిపిస్తుంది. అయితే రాజకీయాల్లో ఇలాంటి చర్యలు కేవలం వ్యక్తిగతంగా ఉండవు. ఇది అంతర్గత విభేదాలను తగ్గించే ప్రయత్నంగా, లేదా పార్టీ ఐక్యతను ప్రదర్శించే సంకేతంగా చూడవచ్చు. సుస్మిత విమర్శల తర్వాత సురేఖ స్వయంగా రాఖీ కట్టడం వల్ల వివాదం తెరపడింది అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగతా 02లో



రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి సవిత, మాజీమంత్రి పీతల సుజాత, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, పలువురు మహిళలు, తదితరులు ఉన్నారు.
-ముద్ర అమరావతి :

## ప్రజ్ఞానంద సరికొత్త చరిత్ర
కరువానాపై విజయం



- ప్రజ్ఞానందకు చారిత్రక టైటిల్
- గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్ విజేతగా ప్రజ్ఞానంద
- ₹1.7 కోట్లకుపైగా ప్రైజ్ మనీ
- ఆరు పాయింట్ల వెనుకబాటును అధిగమించిన ప్రజ్ఞానంద

02

## రాయదుర్గ్ భూముల వేలంలో రికార్డ్

- ఎకరాకు రూ.269 కోట్లు..
- రిజర్వ్ ధరపై 52.3 శాతం ప్రీమియం

06



హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలోనే మును పెన్నడూ లేని విధంగా రాయదుర్గ్ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించిన భూముల ఈ–వేలం సరికొత్త రికార్డులను సృష్టించింది. కేవలం వారం రోజుల వ్యవధిలో వేలం వేసిన *10.63* ఎకరాల (ప్లాట్–పీ*1*, ప్లాట్–పీ*2*) భూమి ద్వారా ప్రభుత్వానికి ఏకంగా రూ. *2,833.22* కోట్ల మస్తు ఆదాయం సమకూరింది.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా
# ఇందిరమ్మ టవర్స్
02

రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- క్యూర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా
- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ప్లాట్లకు లక్కీడ్రా
- పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్



## తెలంగాణలో పెరిగిన నేరాలు
03

హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు..

- డ్రగ్స్ కేసుల్లో భారీ పెరుగుదల
- సైబర్, ఆర్థిక నేరాలకు బ్రేక్
- పోలీసులకు డీజీపీ కీలక ఆదేశాలు



ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం, 29.08.2026
www.mudranews.in | @mudranews



## మంచి బ్యాక్టీరియాకు ఆహారం ఇవ్వాలి




మనం జీర్ణించుకోలేని పీచు, కొన్ని శాకాహార ప్రొటీన్లు పేగు బ్యాక్టీరియాకు ఆహారంగా పని చేస్తాయి. వీటిని బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేసినప్పుడు శరీరానికి మేలు చేసే జీవక్రియ పదార్థాలు ఉత్పత్తి అవుతాయి.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా
# ఇందిరమ్మ టవర్స్

**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు.
క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తున్నాం అన్నారు.
శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి లక్ష్మీగూడలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈరోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.
ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు.
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు.
క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తోందని, చివరి విడత బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు.
రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.
ప్రభుత్వానికి డబ్బు కూడబెట్టుకోవడం కంటే పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యమని అన్నారు. ఎకరం రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి అని మంత్రి స్పష్టం చేశారు.
ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం పదేళ్ల తర్వాత అవసరాన్ని బట్టి ఇంటిని విక్రయించుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు. అంతకుముందే ఏదైనా అత్యవసర అవసరం ఏర్పడితే, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బ్యాంకులో కుదువ పెట్టుకుని రుణం పొందే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.
లక్కీడ్రాలో ఇల్లు పొందిన ప్రతి లబ్ధిదారుడికి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించి అందిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కో ఇంటికి 17 నుంచి 20 గజాల అన్‌డివైడెడ్ షేర్ భూమి కూడా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన స్థలాల్లో అవసరాన్ని బట్టి 10 అంతస్తుల వరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లిఫ్ట్‌లతో పాటు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని చెప్పారు.
లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుందని, అధికారుల పరిశీలన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని మంత్రి తెలిపారు. ఆ తర్వాత కేవలం 3–4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించుకునే అవకాశం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు.
నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీడ్రాలో తొలుత ఎస్సీ విభాగానికి కేటాయించిన 14 శాతం రిజర్వేషన్ ప్రకారం 67 ఫ్లాట్ల కోసం 288 మంది పేర్లతో కూడిన చీటీలను డ్రమ్ములో వేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, హౌసింగ్ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ ప్రియాంక తదితర అధికారుల సమక్షంలో లబ్ధిదారులతోనే డ్రా తీయించారు. ఎస్సీ విభాగంలో తొలి ఫ్లాట్‌కు మరకాల కృష్ణవేణి ఎంపిక కాగా, అనంతరం టి.అనిత, మంగనూరి అనసూయ, ఎం.కుమారి, శైలజాకుమారి వరుసగా ఫ్లాట్లను లక్కీడ్రా ద్వారా పొందారు.
ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీలకు – 14 శాతం, ఎస్టీలకు – 5 శాతం, బీసీలకు – 16 శాతం, దివ్యాంగులకు – 5 శాతం పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు – 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ఫ్లాట్లలో మొత్తం 50 శాతం రిజర్వేషన్లు ఉండగా, మొత్తంగా మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## మధ్య ఆసియాపై
# మోడీ ఫోకస్

**ముద్ర ఢిల్లీ :**
ప్రధాని నరేంద్ర మోదీ రేపు విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ నెల 29 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో ఉండనున్నారు. ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్ దేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్నారు నాలుగు రోజుల పాటు విదేశీ పర్యటనలో ఉండనున్నారు.
**నాలుగు రోజుల పాటు...**
ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటన కొనసాగుతుంది. ఆయా దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు, వాణిజ్య ఇతర అవసరాలపై ఆ దేశ అధినేతలతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల్లో ఉన్న భారతీయులతో కూడా సమావేశమయ్యే అవకాశముంది.

# ‘రాఖీ’తో రాజీ?!

(మొదటి పేజీ తరువాయి)
**తప్పించాలన్న క్రమశిక్షణ కమిటీ..**
సుష్మిత వ్యాఖ్యలతో మంత్రి సురేఖకు నోటీసులు ఇచ్చిన క్రమశిక్షణ కమిటీకి సురేఖ వివరణ ఇచ్చారు. సుష్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు. దీనిపై అనేక తర్జనభర్జనల తర్వాత కొండా సురేఖను తప్పించాలని క్రమశిక్షణ కమిటీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు నివేదిక ఇచ్చింది. పీసీసీ చీఫ్ దానిని అధిష్టానానికి పంపారు. వారం రోజుల్లో వేటు తప్పదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో సరేఖ రేవంత్ ను కలవడం, రాఖీ కట్టడం ఇది ఉపశమనం కలిగించే అడుగు భావిస్తున్నారు.

**బంగారు రాఖీ కట్టా..**
సీఎం రేవంత్‌కు స్పెషల్ గోల్డ్ రాఖీని వరుసగా మూడో ఏడాది కట్టానని మంత్రి కొండా సురేఖ తెలిపారు. సీఎంతోపాటు ఆయన అల్లుడు, మనవడికి కూడా రాఖీ కట్టినట్లు చెప్పారు. సీఎం నుంచి భరోసా దక్కిందా అని జర్నలిస్టులు అడగగా ‘పండుగ వేళ ఎలాంటి కామెంట్స్ చేయదలుచుకోలేదు. అన్న రేవంత్ ఆశీర్వాదాలు నాతో సహా ఆడపడుచులందరికీ ఉంటాయి’ అని పేర్కొన్నారు. రాఖీ కట్టడం ద్వారా కొండా సురేఖ తన వైఖరిని స్పష్టం చేసినట్టు కనిపిస్తోంది. కుటుంబ సభ్యుల విమర్శలకు మంత్రి స్థాయిలో సమాధానం ఇచ్చినట్టు భావించవచ్చు.
తెలంగాణలో పండుగలు, కుటుంబ బంధాలు రాజకీయ సంబంధాలను మరింత దగ్గర చేస్తాయి. రాఖీ లాంటి చర్యలు ఒకవైపు సంప్రదాయికంగా కనిపిస్తే, మరోవైపు అధికార పార్టీలోని సంబంధాలను బలోపేతం చేసే సాధనంగా కూడా పనిచేస్తాయి. ఇప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి, కొండా సురేఖ మధ్య సంబంధం సామరస్యంగా ఉందని ఈ సంఘటన సూచిస్తోంది.

# ప్రజ్ఞానంద సరికొత్త చరిత్ర

**ముద్ర, చెన్నై :**
భారత యువ గ్రాండ్‌మాస్టర్ రామేశ్‌బాబు ప్రజ్ఞానంద అంతర్జాతీయ చెస్ రంగంలో సరికొత్త చరిత్ర లిఖించాడు. ప్రపంచ అత్యున్నత, ప్రతిష్టాత్మక చెస్ సిరీస్ అయిన ‘గ్రాండ్ చెస్ టూర్’ టైటిల్‌ను కైవసం చేసుకున్న మొట్టమొదటి భారతీయ ఆటగాడిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించాడు. టైటిల్ పోరులో భాగంగా జరిగిన అత్యంత ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్, అమెరికా దిగ్గజం ఫాబియానో కరువానాపై ప్రజ్ఞానంద 15–13 పాయింట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేశాడు.
ఈ గ్రాండ్ చెస్ టూర్ సుదీర్ఘ లీగ్‌లో ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడిస్తూ అజేయంగా దూసుకెళ్లిన ప్రజ్ఞానంద, తన కెరీర్‌లో మొట్టమొదటి గ్రాండ్ చెస్ టూర్ మెగా టైటిల్‌ను ముద్దాడాడు. ఈ చారిత్రాత్మక విజయంతో పాటు ప్రజ్ఞానందకు దాదాపు రూ. 1.9 కోట్ల (2,25,000 డాలర్లకు పైగా) భారీ ప్రైజ్ మనీ లభించింది. టోర్నమెంట్ ఆరంభం నుండి తనదైన వ్యూహాలు, ప్రశాంతమైన ఆటతీరుతో కరువానా ఎత్తులను చిత్తు చేసిన ప్రజ్ఞానందను అంతర్జాతీయ చెస్ మేధావులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.
ఈ అద్భుత టైటిల్ విజయంతో ప్రజ్ఞానందకు మరో భారీ ప్రయోజనం కూడా చేకూరింది. ఈ టూర్ ఛాంపియన్‌గా నిలవడం ద్వారా.. వచ్చే ఏడాది (2027) జరగబోయే అత్యంత ప్రతిష్టాత్మకమైన ‘గ్రాండ్ చెస్ టూర్’ సిరీస్‌కు ఎటువంటి క్వాలిఫైయర్ మ్యాచ్‌లు లేకుండానే నేరుగా అర్హత సాధించి తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ఈ అరుదైన విజయంతో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత అంతర్జాతీయ స్థాయిలో భారత జెండా ఎగరేరసి అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్‌గా దేశ కీర్తిని పెంచాడు.

# అప్పుల ఊబిలో ‘రియల్’ కలలు



(మొదటి పేజీ తరువాయి)
దాగి ఉన్నాయి. పిల్లలకు మంచి చదువు, మెరుగైన భవిష్యత్తును అందించాలనే ఆశతో పల్లెల నుంచి ఖమ్మం చేరుకున్న అనేక కుటుంబాలు నగరంలో కనిపించిన రియల్ వ్యాపార ఊపును చూసి ఆకర్షితులయ్యారు. తమ వద్ద ఉన్న జీవిత కాల కష్టార్జితాన్ని, పొదుపు మొత్తాలను పెట్టుబడిగా పెట్టడమే కాకుండా, తెలిసిన వారి దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ పూర్తి స్థాయిలో రియల్ వ్యాపారంలోకి దిగారు. ప్రారంభంలో కొంత లాభాలు చూసినా, అది తాత్కాలిక సంతోషమే అని గ్రహించేసరికి పరిస్థితి చెయ్యి దాటిపోయింది. నేడు కొనేవారు లేక, ఆస్తులు అమ్ముడుపోక దారుణమైన అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈ ‘రియల్’ మాయాజాలం వల్ల కేవలం వ్యాపారులే కాదు, వారిని నమ్ముకున్న కుటుంబాలు కూడా నడిరోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. విలాసవంతమైన జీవితాలు గడిపిన వారు ఇప్పుడు కనీసం ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక, ఇంటి గడప దాటలేని స్థితికి చేరుకున్నారు. కంటిముందే నిర్మించుకున్న ఆశల సామ్రాజ్యం కూలిపోతుంటే, దానికి తోడు వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లు, కోర్టు నోటీసులు వారి జీవితాలను నరకప్రాయంగా మార్చేశాయి. మెరుపుల వెనుక దాగి ఉన్న ఈ చేదు నిజం, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి అద్దం పడుతోంది.
**పార్టీ ఆఫీసుల్లో పంచాయితీలు..**
**పొలిటికల్ సెటిల్మెంట్లు**
అప్పుల ఒత్తిడి తట్టుకోలేక కొందరు రియల్టర్లు తమకున్న భూములను అప్పులు ఇచ్చిన వారికే అప్పగిస్తూ చేతులెత్తేస్తున్నారు. కొన్ని చోట్ల అప్పులు ఇచ్చిన వారే పెద్దమనుషుల వద్ద పంచాయితీలు పెట్టి, తీవ్ర ఒత్తిడి తెచ్చి భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఇటువంటి ప్రైవేటు పంచాయితీలు రాజకీయ పార్టీల కార్యాలయాల్లో, కొందరు నాయకుల కనుసన్నల్లోనే సాగుతున్నాయనే ప్రచారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టపరమైన పరిష్కారాల కంటే ప్రైవేటు సెటిల్మెంట్లకే ప్రాధాన్యం పెరుగుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.
**‘సేఫ్’ అయ్యేందుకు ఇళ్లు కడితే..**
ఈ పతనం నుంచి బయటపడటానికి కొందరు చేసిన చివరి ప్రయత్నాలు కూడా వికటించాయి. ఖాళీ ప్లాట్లు అమ్ముడుపోవడం లేదని, మరికొన్ని అప్పులు తెచ్చి మరీ ఆ ప్లాట్లలో భవన నిర్మాణాలు చేపట్టారు. ఇళ్లు నిర్మిస్తేనైనా కొనుగోలుదారులు ముందుకు వస్తారని ఆశపడ్డారు. కానీ తీరా నిర్మాణాలు పూర్తయినా కొనేవారు కరువై, ఇటు కొత్తగా తెచ్చిన అప్పుల వడ్డీలు భరించలేక, అటు పాత బకాయిలు తీర్చలేక మరింత ఊబిలోకి దిగజారిపోయారు. సొంత ఊరు వదిలి పట్టణానికి వచ్చి ఉన్నదంతా ఊడ్చి పెట్టుబడిగా పెట్టిన కుటుంబాలు, ఇప్పుడు కనీసం ఫైనాన్స్ కిస్తీలు కూడా కట్టలేక నడిరోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. పరువు కోసం బయటకు చెప్పుకోలేక, లోపల ఐపీ దాఖలు చేసే దిశగా ఆలోచిస్తున్నారంటే ఖమ్మం రియల్ రంగంలో పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# బీఆర్ఎస్ ‘పోరుబాట’

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై పోరుబాటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈరోజు(శుక్రవారం) పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ మంత్రి.. నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసాలు చేసిందంటూ బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. వారం రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలను చేపట్టాలని, 420 హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వెయ్యి రోజులైనా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, కాంగ్రెస్ హామీల వైఫల్యం, అవినీతిపై పోరాడాలని టెలికాన్ఫరెన్స్‌లో నేతలకు కేటీఆర్ నిర్దేశం చేశారు. సెప్టెంబర్1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌తో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లనుంది.

**రెండో తేదీ నుంచి వరుసగా కార్యక్రమాలు**

**సెప్టెంబర్ 2**
ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
420 హామీల మోసాన్ని గుర్తుచేస్తూ భారీ ఫ్లెక్సీల ప్రదర్శన
ప్రజలకు బాకీ ఉన్న హామీలతో ఇంటింటికీ బాకీ కార్డుల పంపిణీ
**సెప్టెంబర్ 3**
వ్యవసాయ విధ్వంసంపై అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులు
సాగునీరు, విద్యుత్, యూరియా, బీమా సమస్యలపై రైతులతో సమావేశాలు
హైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై నిరసనలు
**సెప్టెంబర్ 4**
మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సు
మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై నిరసన కార్యక్రమాలు
రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి , షాదీముబారక్ అంశాలపై నిలదీత
హామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు
**సెప్టెంబర్ 5**
విద్యార్థులు, యువతతో నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు
ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై పోరాటం
అదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులు
**సెప్టెంబర్ 6**
హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ
తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతలపై ప్రభుత్వాన్ని నిలదీత
గ్రామాల్లో పారిశుద్ధ్యం, పల్లెల సమస్యలపై నిరసన కార్యక్రమాలు
**సెప్టెంబర్ 7**
ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు
420 హామీల మోసంపై జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులు
**సెప్టెంబర్ 8**
వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు
అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు
**సెప్టెంబర్ 10**
ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావం




# నేపాల్‌లో మరో జల ప్రళయం ముప్పు

**ముద్ర ఢిల్లీ :**
నేపాల్‌ను ఇప్పటికే అతలాకుతలం చేసిన భారీ ఫ్లాష్ ఫ్లడ్స్ నుంచి కోలుకోకముందే.. మరో భారీ జల విపత్తు ముప్పు ఆ దేశాన్ని వణికిస్తోంది. ముఖ్యంగా రసూవా జిల్లాలో మరోసారి ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించే ప్రమాదం ఉందని నేపాల్ ఆర్మీ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తమై సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో సహాయక చర్యలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.
**ఇప్పటికే 469 మంది మృతి**
ఆగస్టు 26న నేపాల్‌లో సంభవించిన భయంకరమైన ఫ్లాష్ ఫ్లడ్స్ తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. రసూవా ప్రాంతంలో మొదలైన వరద ఉద్ధృతి భోటేకోషి, త్రిశూలి నదుల వెంట దిగువ ప్రాంతాలకు దూసుకెళ్లింది. నీటితో పాటు భారీగా మట్టి, రాళ్లు, శిథిలాలు కొట్టుకురావడంతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజా అధికారిక లెక్కల ప్రకారం.. ఈ విపత్తులో 469 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలను గుర్తించారు. చిత్వాన్‌లో అత్యధికంగా 178 మంది మృతదేహాలు లభించగా.. నావల్‌పరాసి ఈస్ట్‌లో 110, గోర్ఖాలో 44, నువాకోట్‌లో 37, ధాదింగ్‌లో 33, తనహున్‌లో 28, నావల్‌పరాసి వెస్ట్‌లో 27, రసూవాలో 12 మృతదేహాలు లభించాయి.
**మళ్లీ వరద ముప్పు ఎందుకు?**
హిమాలయ ప్రాంతాల్లో భారీగా నీరు, మంచు, మట్టి, రాళ్లు కదలడంతో నదుల ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచి బ్యారియర్ లేక్‌లుగా మారడం ఇప్పుడు కొత్త ప్రమాదానికి కారణమవుతోంది. వాటిలో ఒకటి నీటి ఒత్తిడిని తట్టుకోలేక పొంగిపొర్లే పరిస్థితి ఏర్పడటంతో.. అది ఒక్కసారిగా తెగిపోతే దిగువ ప్రాంతాలపై భారీ స్థాయిలో వరద విరుచుకుపడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రసూవా ప్రాంతంలో ప్రజలను ఎత్తైన, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రమాదం పెరుగుతుందన్న హెచ్చరికలతో హెలికాప్టర్ రెస్క్యూ కార్యకలాపాలను కూడా కొంతసేపు నిలిపివేయాల్సి వచ్చింది.
**రెస్క్యూ ఆపరేషన్‌కు తీవ్ర ఆటంకాలు**
ఇప్పటికే వేలాది మంది సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. నేపాల్ పోలీసుల ప్రకారం ఇప్పటివరకు 1,545 మందిని రక్షించారు. రసూవా నుంచి 644 మంది, నువాకోట్ నుంచి 898 మంది, ధాదింగ్ నుంచి ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే 28 మంది పోలీసు సిబ్బంది ఇంకా ఆచూకీ లేకుండా ఉన్నారు. వరదల కారణంగా రహదారులు, వంతెనలు ధ్వంసం కావడం.. కొండ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం.. ఇప్పుడు మరోసారి వరద ముప్పు పొంచి ఉండటంతో సహాయక చర్యలు మరింత క్లిష్టంగా మారాయి. 469 మంది ప్రాణాలను బలిగొన్న విషాదం నుంచి నేపాల్ ఇంకా కోలుకోకముందే.. మరో జల ప్రళయం ముప్పు హెచ్చరికలు రావడం ఆ దేశ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

# బీసీ, ఈబీసీలకు గుడ్ న్యూస్

**ముద్ర, హైదరాబాద్:**
విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.
**సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తులు**
సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి.
**గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు**
విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. GRE/GMAT స్కోర్‌తో పాటు TOEFL/IELTS/PTEలో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 29.08.2026
www.mudranews.in | @mudranews



## పీచు తగ్గితే పేగులకే ముప్పు

ఆహారంలో పీచు తగినంత లేకపోతే పేగు బ్యాక్టీరియా ఇతర వనరుల కోసం వెతుకుతుంది. చివరకు పేగుల లోపలి రక్షణ పొరలోని జిగురు పదార్థాలను విచ్ఛిన్నం చేసే పరిస్థితి ఏర్పడొచ్చు. ఇది పేగుల ఆరోగ్యానికి హానికరం.



## వెన్నెముక సమస్య ఉన్న మహిళకు రూ. 5 లక్షల ఎల్.ఓ.సీ.

### సీఎం లేఖను పేషంట్ కుమారునికి అందజేసిన చిన్నారెడ్డి



**ముద్ర, హైదరాబాద్ :** తీవ్రమైన వెన్నెముక సమస్యతో బాధపడుతూ నిమ్స్ లో చేరిన మహిళ చికిత్స కోసం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ. ఐదు (5) లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి) ని పేషంట్ పద్మమ్మ కుమారుడు రాజశేఖర్ రెడ్డికి సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అందజేశారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో జరిగిన 251 సీఎం ప్రజావాణి కార్యక్రమానికి నారాయణపేట జిల్లా మద్దూరు మండలం పెద్రి పాడ్ గ్రామానికి చెందిన అన్నసారం పద్మమ్మ కుమారుడు రాజశేఖర్ రెడ్డి వచ్చి చిన్నారెడ్డికి సమస్యను వివరించి ఎల్ఓసి ఇప్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నిమ్స్ వైద్యులు ఇచ్చిన ఎస్టిమేషన్, రోగ వివరాలు అన్నీ కలిపి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ లెటర్ అఫ్ క్రెడిట్ ఇస్తూ సీఎం కార్యాలయం లేఖను నిమ్స్ డైరెక్టర్ కు డబ్బులు లేకుండా చికిత్స చేయాలని ఆదేశించారు. చికిత్స తర్వాత బిల్లులు సీఎం కార్యాలయానికి పంపాలని సూచించారు. ఇదంతా కొన్ని గంటల్లోనే చక చక జరిగిపోయింది. తమ సమస్యపై వెంటనే స్పందించి ఎల్ఓసి మంజూరు చేయించిన చిన్నారెడ్డికి పద్మమ్మ కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

## ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి

**ముద్ర, హైదరాబాద్ :** ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. సంఘటన జరిగిన అనంతరం ఆ బాలిక ఆసుపత్రిలో అడ్మిట్ అయినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆ బాలిక ఆరోగ్య ప రిస్థితిని పర్యవేక్షించడం తోపాటు కుటుంబ సభ్యుల బాగోగులను కూడా తెలుసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## అక్క చెల్లెళ్లలకు సీఎం రేవంత్ రాఖీ శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్ :** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్క చెల్లెళ్ళ ల కు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.

## అమెరికాలో తెలుగు యువతి నిఖిత హత్య కేసులో ట్విస్ట్




**ముద్ర, హైదరాబాద్ :** అమెరికాలో తెలుగు యువతి నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది.. మాజీ ప్రియుడు అర్జున్ శర్మ(27)ను ఆగ్రాలో అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులు. ఆగస్టు 24న అర్జున్ శర్మను అదుపులోకి తీసుకున్న పోలీసులు. అమెరికాలో నిఖిత హత్య అనంతరం భారత్ కు పరారైన అర్జున్ శర్మ. హైదరాబాద్ లాలాగూడ పీఎస్ లోనూ అర్జున్ శర్మపై కేసు నమోదైంది. ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టులో అర్జున్ శర్మను హాజరుపరిచిన పోలీసులు. అమెరికా అభ్యర్థనతో అప్పగింత ప్రక్రియ ప్రారంభం. భారత్–అమెరికా నేరస్తుల అప్పగింత ఒప్పందం కింద తదుపరి చర్యలు తీసుకోనున్నారు. 2025 డిసెంబర్ 31న అమెరికాలోని మేరీల్యాండ్ లో నిఖితను హత్య చేసిన అర్జున్ శర్మ..!

## భట్టి విక్రమార్క 'హట్టి గోల్డ్ మైన్స్' సందర్శన




**ముద్ర, హైదరాబాద్ :** రక్షాబంధన్ పండగ రోజున తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లాలోని 'హట్టి గోల్డ్ మైన్'ను సందర్శించారు. దేశంలోనే ఏకైక ప్రభుత్వ రంగానికి చెందిన ఈ బంగారం ఉత్పత్తి సంస్థలోని ప్రొడక్షన్ యూనిట్, బంగారం శుద్ధి కేంద్రం మరియు ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మైన్స్ అధికారులు బంగారం తయారీ విధానాన్ని ఉప ముఖ్యమంత్రికి వివరంగా తెలియజేశారు. హట్టి గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతిరోజు సగటున 2 నుంచి 4 కిలోల బంగారం తయారవుతుందని అధికారులు వివరించారు.సింగరేణి సంస్థ వేలంలో దక్కించుకున్న 'దేవదుర్గ బంగారం–రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్' కూడా ఈ హట్టి గోల్డ్ మైన్స్ సమీపంలోనే ఉండటం గమనార్హం. సందర్శనలో భాగంగా భట్టి విక్రమార్క భూగర్భ గనితో పాటు ఓపెన్ కాస్ట్ గనిని కూడా పరిశీలించారు.ఉప ముఖ్యమంత్రి వెంట సింగరేణి సిఎండి బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిఎమ్ పంకజ్ కులశ్రేష్టలతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

# రేవంత్ రెడ్డి సంకుచితంగా వ్యవహరించొద్దు

### - ఈటల రాజేందర్



**ముద్ర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ఎలాంటి వివక్ష చూపడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే, మున్సిపల్ పనులపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఆయన భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించి రిప్రజెంటేషన్లు అందజేశారు. అనంతరం సచివాలయంలోని మీడియా పాయింట్‌లో మాట్లాడారు.

కేంద్రం అడిగిన దానికంటే ఎక్కువ నిధులు తెలంగాణకు కేటాయిస్తోందని ఈటల పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో రైల్వే లైన్లు ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల్లో ఆర్వోబీలు, ఆర్‌యూబీలు లేవని, వాటి నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు 23 రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

రైల్వే పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా.. ఎన్వోసీలు, ట్రాఫిక్ డైవర్షన్ వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ సహకారం తప్పనిసరని ఈటల చెప్పారు. హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

**మున్సిపాలిటీల్లో పనులు ఆగిపోయాయి**

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మూడు మున్సిపాలిటీల్లో పనులు ముందుకు సాగడం లేదని ఈటల ఆరోపించారు. నిధులు వస్తాయో రావో అన్న భయంతో టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. చిన్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చినా అక్కడ కనీస అభివృద్ధి పనులు జరగడం లేదని విమర్శించారు.అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీమ్‌ల కింద కేంద్రం నిధులు అందిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేస్తే పేదల ఇళ్ల నిర్మాణానికి నిధులు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. మెట్రో ఫేజ్–1, ఫేజ్–2కు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లో డ్రైనేజీలు, రోడ్లు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రేషన్ కార్డులపై సీఎం ఫొటోలు ఎందుకు?**

రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ముద్రించడంపై ఈటల రాజేందర్ ప్రశ్నలు లేవనెత్తారు. రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యం ఇస్తోందని, అలాంటప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ముఖ్యమంత్రుల ఫొటోలతో కొత్త రేషన్ కార్డులు ముద్రిస్తారా? అని నిలదీశారు. ప్రజాధనాన్ని ఇలా ఖర్చు చేయడం సమంజసం కాదని అన్నారు.

**'కేంద్రం వివక్ష చూపడం లేదు'**

కేంద్రం తెలంగాణకు ఎక్కడా వివక్ష చూపడం లేదని ఈటల స్పష్టం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. రూ.6,300 కోట్లతో 30 ఏళ్ల క్రితం మూతపడిన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని కేంద్రం పునరుద్ధరించిందని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని నిర్మించిందని చెప్పారు. చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రూరల్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.1.75 లక్షలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.2.25 లక్షలు కేంద్రం అందిస్తోందని ఈటల తెలిపారు. నిజమైన పేదలకు పార్టీలకు అతీతంగా ఇళ్లు నిర్మించి ఇస్తే మరిన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

**రేవంత్ టూర్‌పై ఈటల ఘాటు వ్యాఖ్యలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై కూడా ఈటల స్పందించారు. భారతదేశ వ్యతిరేక శక్తులను కలిసేందుకు వెళ్తున్నారనే కారణంతోనే టూర్‌కు అనుమతి ఇవ్వలేదని, కేంద్రానికి ఎలాంటి వివక్ష లేదని అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల్లో భారతదేశంపై విమర్శలు చేస్తున్నారని ఈటల ఆరోపించారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన బాంబు పేలుళ్లను ప్రస్తావిస్తూ.. మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందని అన్నారు."మోదీపై విమర్శ చేయడమంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమే" అని ఈటల ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసం, సీట్ల కోసం తాము రాజకీయాలు చేయబోమని.. దేశం తర్వాతే పార్టీ, వ్యక్తులు, అధికారం అనేది తమ సిద్ధాంతమని స్పష్టం చేశారు.

**'ముఖ్యమంత్రి నాలుగు కోట్ల ప్రజలకు తండ్రిలా ఉండాలి'**

రేవంత్ రెడ్డి సంకుచితంగా వ్యవహరించవద్దని ఈటల సూచించారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులు వ్యక్తిగతమైనవి కావని, ముఖ్యమంత్రి నాలుగు కోట్ల ప్రజలకు తండ్రిలా వ్యవహరించాలని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రోటోకాల్ గౌరవం ఉండాలని, రాజకీయ కోణంలో ప్రజాప్రతినిధులను చూడటం సరికాదని పేర్కొన్నారు.

ప్రజల డబ్బు కేంద్రానిదైనా, రాష్ట్రానిదైనా అది ప్రజలదేనని ఈటల అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలోనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాన్నే కేంద్రం అనుసరిస్తోందని తెలిపారు.

## జల వివాదాలపై గట్టిగా వాదించాలి

### - సీఎం రేవంత్‌రెడ్డి



**ముద్ర, హైదరాబాద్:** అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించి వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటి పారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై ఈ సమీక్షలో చర్చించినట్లు సమాచారం. మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి.. ఇతర రాష్ట్రాల వాదనలేంటి.. తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరాతీసినట్లు సమాచారం.

**ప్రజ్ఞానందకు అభినందనలు తెలిపిన సీఎం**

అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని.. చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని సీఎం పేర్కొన్నారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి రాఖీ కట్టిన మహిళా నేతలు



**ముద్ర, హైదరాబాద్ :** బి.ఆర్.ఎస్ అధినేత , తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర రావు కి పార్టీ మహిళా నేతలు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వారిద్దరినీ ఆత్మీయంగా పలకరించి ఆశీర్వదించారు. వారికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన మహిళా నేతలిద్దరినీ కేసీఆర్ దంపతులు చీర సారె తో సత్కరించి దీవించారు.

# తెలంగాణలో పెరిగిన నేరాలు

- హైదరాబాద్‌లో తగ్గిన తీవ్రమైన నేరాలు..
- డ్రగ్స్ కేసుల్లో భారీ పెరుగుదల
- సైబర్, ఆర్థిక నేరాలకు బ్రేక్
- పోలీసులకు డీజీపీ కీలక ఆదేశాలు




**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో తీవ్రమైన నేరాలు తగ్గినట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. తెలంగాణలో నేరాలపై పోలీసు అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివరాలు వెల్లడించారు. తెలంగాణలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయి. 2023–24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025–26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగింది. డ్రగ్స్ కేసుల్లో 46.10% పెరుగుదల నమోదై 2,026 నుంచి 2,960 కేసులు పెరిగాయి. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి 451కి పెరిగాయి. ట్రాఫిక్ నేరాల్లో 9.48% పెరుగుదల నమోదైంది. మరోవైపు సైబర్ క్రైమ్ రేటు 13.29 శాతానికి తగ్గింది. ఆర్థిక నేరాలు 13.28%, తీవ్ర నేరాలు 10.33 శాతానికి తగ్గాయి. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23% తగ్గగా, సైబరాబాద్‌లో డ్రగ్స్ కేసులు 90.98% పెరిగాయి. ఆదిలాబాద్‌లో డ్రగ్స్ కేసులు 57 నుంచి 219కి చేరాయి.

సమీక్ష సందర్భంగా అధికారులకు డీజీపీ పలు సూచనలు ఇచ్చారు. నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర ధోరణులను ముందుగానే గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు రూపొందించాలని పేర్కొన్నారు. క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ 96%కి చేరిందన్నారు. గతంలో ఈ ఇది 70–80 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఏఐ, సీసీటీఎన్ఎస్, టీజీ కాప్, హాక్ఐ టెక్నాలజీ, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలుపైనా డీజీపీ సమీక్ష నిర్వహించారు. యూనిట్ స్థాయి జవాబుదారీతనం, సత్వర నిర్ణయాలు, ఫోకస్డ్ ఫీల్డ్ యాక్షన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

## రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు..

**- రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం**

**ముద్ర, నిజామాబాద్ న్యూస్ :** బాసర జిల్లా బైంసా, ముథోల్ మండలాల్లో శుక్రవారం పలు రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో రూ.కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి అక్రమాలు వెలుగు చూశాయి. ముథోల్ మండలంలోని వర్తాల గ్రామంలోని నీలకంఠేశ్వర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా.. 2022–23 సంవత్సరం రబీ కాలానికి సంబంధించి ప్రభుత్వం 4,224 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ఇవ్వగా, కేవలం 336 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లెక్కతేలింది. మిగతా 3,888 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైంది. లెక్కతేలని ధాన్యం విలువ సుమారు రూ.8.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

బైంసా మండలంలోని మాటేగా గ్రామంలో ఉన్న నీలకంఠ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా అక్కడ 977 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చింది. దీని విలువ సుమారు రూ.2.19 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విజిలెన్స్ దాడిలో కరీంనగర్ విజిలెన్స్ డీఎస్పీ సీతారెడ్డి, తహసీల్దార్ దినేష్ చంద్ర, సీఐలు అనిల్ కుమార్, ప్రశాంత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 29.08.2026

4 వేదిక
Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# ప్రకృతితో ఆటలాడొద్దు

## ప్రకృతే మనకు శిక్ష విధిస్తుంది

హిమాలయాలలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..
వేగంగా కరుగుతున్న హిమనదులు..
హిమనదుల విస్ఫోటనాలు..
అంతకంతకూ పెరుగుతున్న మానవ తప్పిదాల ప్రభావం..

వాతావరణ మార్పుల ప్రభావం ఇలాగే కొనసాగితే, రాబోయే దశాబ్దాల్లో హిమా లయ ప్రాంతంలో మంచు, హిమనదుల కరుగుదల మరింత వేగవంతమయ్యే ప్రమాదం ఉంది. దీని ప్రభావం నేపాల్, భూటాన్‌తో పాటు భారతదేశంలోని హిమాలయ ప్రాంత రాష్ట్రాలపై తీవ్రంగా పడవచ్చు. ఆకస్మిక వరదలు, కొండ చరియలు, నదుల ఉధృతి వంటి విపత్తులు కోట్లాది ప్రజల జీవనాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

అభివృద్ధి అవసరమే...
కానీ ప్రకృతిని నాశనం చేసే అభివృద్ధి కాదు.

అడవులను నరికివేస్తూ...
నదుల సహజ ప్రవాహాలను మార్చుతూ...
పర్వతాలను విచ్చలవిడిగా తవ్వుతూ...
కాలుష్యాన్ని పెంచుతూ...
ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే—

దాని మూల్యం చివరకు మనమే చెల్లించాలి.

ప్రకృతి మన కోసం కాదు... మనం ప్రకృతిలో ఒక భాగం.

ప్రకృతితో మనం ఆడుకుంటే...
ప్రకృతి మనల్ని బలి తీసుకుంటుంది.

ఇప్పటికైనా మేల్కొందాం...
ప్రకృతిని కాపాడుదాం...
భవిష్యత్ తరాలను రక్షిద్దాం.

# సాధారణ టీ కంటే అల్లం టీ మంచిది?

ఉదయం నిద్ర లేవగానే చాలా మంది మనసు చాలా నిద్రమత్తులో ఉంటుంది. దీనిని పోగొట్టేందుకు, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు టీ లేదా కాఫీ తీసుకుంటారు. ఈ పదార్థాల్లో ఉండే కెఫిన్ తో మనసులో ఉత్తేజాన్ని నింపి రోజంతా పనులు చక్కగా చేయగలిగే శక్తిని ఇస్తుందని చాలా మంది భావన. అయితే ఈ సమయంలో సాధారణ టీకంటే అల్లం టీ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు అంటున్నారు. అసలు అల్లం టీలో ఏముంటాయి? దీనిని ఎందుకు తీసుకోవాలి?

తాగడం వల్ల జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రోత్సహించి ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ప్రయాణ సమయంలో వచ్చే వికారం, వాంతుల భావనను కూడా తగ్గించడంలో అల్లం ఉపయోగపడుతుంది. అల్లం టీ అప్పుడప్పుడు తాగడం వల్ల శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాల వల్ల వచ్చే సాధారణ ఇన్‌ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తి అల్లం టీకి ఉంటుంది. అందుకే సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే ఈ సమయంలో అల్లం టీ తాగాలని నిపుణులు సూచిస్తుంటారు.



ప్రస్తుతం వర్షాకాలం. వాతావరణంలో అనేక మార్పులు ఉంటాయి. ఈ సమయంలో శరీరంలో రోగ నిరోధక శక్తిని ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు ప్రతి రోజూ తినే సాధారణ పదార్థాలతో పాటు అదనపు బూస్ట్ ను అందించేందుకు ప్రత్యేక పదార్థాలు తీసుకోవాలి. ఇందులో భాగంగా ప్రత్యేక పానీయాలు తీసుకోవడం వల్ల శరీరంలో జీర్ణక్రియ సులభంగా ఉండి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. ప్రత్యేక పానీయాల్లో అల్లం, శొంటి టీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే శరీరానికి హానికరమైన ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడతాయి.

భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి వారికి అల్లం టీ మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. దీనిని

జలుబు, గొంతు నొప్పి, దగ్గు వంటి సమస్యలు వచ్చినప్పుడు అల్లం టీ మంచి ఔషధంలా పనిచేస్తుంది. ఇందులోని వేడి గుణం గొంతుకు ఉపశమనం కలిగిస్తుంది. శ్వాసనాళాల్లో పేరుకుపోయిన కఫాన్ని పలుచబరచి బయటకు రావడానికి కూడా ఇది సహాయపడుతుంది. కడుపులో అసౌకర్యం, వికారం లేదా స్వల్ప కడుపునొప్పి ఉన్నప్పుడు వేడి వేడి అల్లం టీ తాగితే ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది.

అయితే అల్లం టీ అందరికీ ఒకే విధంగా సరిపోదు. తరచూ ఎసిడిటీ, గ్యాస్ట్రిక్ అల్సర్ సమస్యలు ఉన్నవారు లేదా శరీరంలో అధిక వేడి ఉండే వారు మితంగా మాత్రమే తీసుకోవాలి. రక్తాన్ని పలుచబరిచే మందులు వాడుతున్నవారు, గర్భిణులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

## దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ఉన్నవారికి

# కొత్త ఆశా కిరణం

సిర్రోసిస్‌ను చాలా కాలంగా దీర్ఘకాలిక కాలేయ వ్యాధి యొక్క చివరి దశగా, ఒకసారి ఏర్పడితే తిరిగి మార్పు చెందని పరిస్థితిగా భావించేవారు. అయితే హెపటాలజీ రంగంలో వచ్చిన ఆధునిక పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని కొంత వరకు మార్చాయి. కాలేయానికి తనను తాను పునరుద్ధరించుకునే అద్భుతమైన సామర్థ్యం ఉంది. కాలేయానికి నష్టం కలిగించే మూల కారణాన్ని గుర్తించి, సమర్థవంతంగా చికిత్స చేసినప్పు డు, కాలేయంలో ఏర్పడిన ఫైబ్రోసిస్ (మచ్చ కణజాలం) కొంత వరకు తగ్గవచ్చు. కాలే య పనితీరు మెరుగుపడవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇప్పటికే ఏర్పడిన సిర్రోసిస్‌లోని కొన్ని మార్పులు కూడా వెనక్కి తగ్గవచ్చు. "సిర్రోసిస్ అనేది తప్పనిసరిగా కాలేయ వైఫల్యానికి దారితీసే ఒకే దిశలో ప్రయాణం కాదు. వ్యాధిని తొలిదశలో గుర్తించి, సరైన సమయంలో చికిత్స చేయడం ద్వారా పరిస్థితిని మెరుగుపరచవచ్చు."

### సిర్రోసిస్ అంటే ఏమిటి?

కాలేయానికి సంవత్సరాల పాటు పదేపదే నష్టం కలిగినప్పుడు సిర్రోసిస్ ఏర్పడుతుంది. దీనికి సాధారణ కారణాలలో హెపటైటిస్ B మరియు C, అధికంగా మద్యం సేవించడం, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్–అసోసియేటెడ్ స్టియాటోటిక్ లివర్ డిసీజ్ (MASLD), ఆటోఇమ్యూన్ కాలేయ వ్యాధులు మరియు ఇతర దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు ఉన్నాయి. కాలేయానికి నిరంతరం నష్టం కలిగినప్పుడు, దాన్ని సరిచేసే ప్రక్రియలో భాగంగా అధికంగా మచ్చ కణజాలం ఏర్పడుతుంది. దీనినే ఫైబ్రోసిస్ అంటారు. కాలక్రమేణా ఈ మచ్చ కణజాలం పెరిగి కాలేయం యొక్క సాధారణ నిర్మాణాన్ని మార్చివేస్తుంది. దీని వల్ల పోర్టల్ హైపర్‌టెన్షన్, పొట్టలో నీరు చేరడం (అసైటిస్), కామెర్లు, జీర్ణాశయం నుంచి రక్తస్రావం, హెపాటిక్ ఎన్సెఫలోపతి మరియు కాలేయ క్యాన్సర్ వంటి సమస్యలు ఏర్పడవచ్చు.

### మారుతున్న వైద్య అవగాహన

గతంలో సిర్రోసిస్‌ను ఒకసారి ఏర్పడితే తిరిగి మారని పరిస్థితిగా భావించేవారు. వ్యాధి చివరి దశకు చేరుకున్నప్పుడు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ మాత్రమే ఖచ్చితమైన చికిత్సగా పరిగణించబడేది. అయితే ప్రస్తుతం మన అవగాహన మరింత స్పష్టమైంది. ఫైబ్రోసిస్ ఒక స్థిరమైన ప్రక్రియ కాదు; అది మార్పులకు లోనయ్యే ప్రక్రియ. కాలేయానికి నష్టం కలిగించే కారణాన్ని తొలగించినప్పుడు లేదా సమర్థవంతంగా నియంత్రించినప్పుడు, కాలేయం మచ్చ కణజాలాన్ని పునర్వ్యవస్థీకరించుకుని తన నిర్మాణం మరియు పనితీరును మెరుగుపరుచుకోగలదు.

హెపటైటిస్ B లేదా Cకు సమర్థవంతమైన యాంటీవైరల్ చికిత్స ఇవ్వడం ద్వారా కాలేయ వ్యాధి గణనీయంగా మెరుగుపడవచ్చు.

మద్యం వల్ల కలిగే కాలేయ వ్యాధిలో పూర్తిగా మద్యం మానేయడం ద్వారా కాలేయం గణనీయంగా కోలుకునే అవకాశం ఉంటుంది.

బరువు తగ్గడం, మెటబాలిక్ సమస్యలను నియంత్రించడం ద్వారా ఫ్యాటీ లివర్ వ్యాధిలో కాలేయ నష్టం తగ్గవచ్చు.

ఆటోఇమ్యూన్ మరియు కొలెస్టాటిక్ కాలేయ వ్యాధులకు తగిన చికిత్స అందించడం ద్వారా మరింత కాలేయ నష్టం జరగకుండా నివారించవచ్చు.

అందువల్ల కాలేయ నష్టాన్ని తిరిగి మెరుగుపరచడంలో మొదటి మరియు అత్యంత ముఖ్యమైన అడుగు—మూల కారణాన్ని గుర్తించి, సమర్థవంతమైన చికిత్స చేయడం

### ఇప్పటికే ఏర్పడిన సిర్రోసిస్ తగ్గుతుందా?

కొన్ని సందర్భాల్లో తగ్గవచ్చు—కానీ ఎల్లప్పుడూ పూర్తిగా కాదు. ఫైబ్రోసిస్ తగ్గడం లేదా ఫైబ్రోసిస్ రిగ్రెషన్ జరుగుతుందని అనేక అధ్యయనాలు చూపించాయి. ముఖ్యంగా




తీవ్రమైన కాలేయ నిర్మాణ మార్పులు ఏర్పడకముందే చికిత్స ప్రారంభించినప్పుడు మంచి ఫలితాలు కనిపించవచ్చు. ఇప్పటికే సిర్రోసిస్ ఉన్న కొంతమంది రోగుల్లో కూడా మూల కారణానికి విజయవంతంగా చికిత్స అందించిన తర్వాత కాలేయ పనితీరు మెరుగుపడవచ్చు, పోర్టల్ హైపర్‌టెన్షన్ కొంత వరకు తగ్గవచ్చు. అయితే కాలేయ ఎంజైములు సాధారణ స్థాయికి రావడం లేదా ఫైబ్రోసిస్ కొలత తగ్గడం మాత్రమే ఆధారంగా "సిర్రోసిస్ పూర్తిగా నయమైంది" అని భావించకూడదు. గతంలో సిర్రోసిస్ ఉన్న రోగులకు వారి వ్యక్తి గత ప్రమాదాన్ని బట్టి హెపటోసెల్యులార్ కార్సినోమా (కాలేయ క్యాన్సర్), పోర్టల్ హై పర్‌టెన్షన్ వంటి సమస్యల కోసం నిరంతర పర్యవేక్షణ అవసరం కావచ్చు. అందువల్ల సరైన సందేశం "కొంత మంది రోగుల్లో సిర్రోసిస్‌లోని మార్పులు కొంతవరకు వెనక్కి తగ్గవచ్చు. అయితే వ్యాధి ముదరకముందే గుర్తించి, దాని పురోగతిని నివారించడమే అత్యంత ముఖ్యం."

### ఫైబ్రోసిస్‌ను గుర్తించడంలో పాత్ర

కాలేయ వ్యాధి నిర్ధారణలో వచ్చిన ముఖ్యమైన ఆధునిక పురోగతుల్లో ఫైబ్రోస్కాన్ (Transient Elastography) ఒకటి. గతంలో కాలేయంలో ఫైబ్రోసిస్ స్థాయిని తెలుసుకోవడానికి లివర్ బయాప్సీని ఎక్కువగా ఉపయోగించేవారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బయాప్సీ ఇప్పటికీ అవసరం కావచ్చు. అయితే ఇది శరీరంలోకి సూది ప్రవేశపెట్టే ఇన్వేసివ్ పరీక్ష కావడంతో, ప్రతి రోగిలో పదేపదే చేయడం ఆచరణాత్మకంగా ఉండదు. ఫైబ్రోస్కాన్ అనేది శరీరంలోకి సూది పెట్టకుండా చేసే, త్వరగా పూర్తయ్యే నాన్-ఇన్వేసివ్ పరీక్ష. ఇది కాలేయం యొక్క stiffness (గట్టితనం)ను కొలిచి, కాలేయంలో ఫైబ్రోసిస్ స్థాయిని అంచనా వేయడానికి సహాయపడుతుంది. అవసరమైన రోగుల్లో దీనిని కాలక్రమేణా పదేపదే చేయడం ద్వారా చికిత్సకు కాలేయం ఎలా స్పందిస్తుందో పర్యవేక్షించవచ్చు. అయితే ఫైబ్రోస్కాన్ కొలతపై ఫైబ్రోసిస్‌తో పాటు కాలేయంలో వాపు, రక్తం/ద్రవం నిల్వ వంటి ఇతర అంశాలు కూడా ప్రభావం చూపవచ్చు. అందువల్ల ఫైబ్రోస్కాన్ ఫలితాలను రక్త పరీక్షలు, రోగి లక్షణాలు మరియు ఇతర పరీక్షలతో కలిపి వైద్యులు అర్థం చేసుకోవాలి.

### ఎవరికి కాలేయం మెరుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది?

ఫైబ్రోసిస్ తగ్గే అవకాశం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది

కాలేయ నష్టం యొక్క దశ మరియు తీవ్రత

కాలేయ వ్యాధికి మూల కారణం

ఆ కారణాన్ని ఎంత సమర్థవంతంగా నియంత్రించగలుగుతున్నామన్నది

తీవ్రమైన పోర్టల్ హైపర్‌టెన్షన్ వంటి సమస్యలు ఉన్నాయా లేదా

కాలేయ క్యాన్సర్ ఉందా లేదా

రోగి యొక్క మెటబాలిక్ ఆరోగ్యం, పోషకాహారం మరియు జీవనశైలి

చికిత్స ఎంత తొందరగా ప్రారంభించబడింది

అందువల్ల కాలేయ వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం అత్యంత ముఖ్యం.

### చికిత్సే కీలకం

ప్రస్తుతం సిర్రోసిస్‌ను ఒక్కసారిగా "తొలగించే" ఒకే ఒక్క మందు లేదు. చికిత్స యొక్క ప్రధాన లక్ష్యం కాలేయానికి నిరంతరం నష్టం కలిగించే కారణాన్ని ఆపడం లేదా నియంత్రించడం. వ్యాధి కారణాన్ని బట్టి యాంటీవైరల్ మందులు, పూర్తిగా మద్యం మానేయడం, బరువు తగ్గడం మరియు మెటబాలిక్ సమస్యలను నియంత్రించడం, ఆటోఇమ్యూన్ లేదా కొలెస్టాటిక్ కాలేయ వ్యాధులకు చికిత్స ఇవ్వడం, అలాగే సిర్రోసిస్ వల్ల వచ్చే సమస్యలకు తగిన చికిత్స అందించడం అవసరం కావచ్చు. కాలేయానికి జరుగుతున్న నష్టం నియంత్రించబడినప్పుడు, కాలేయం తనను తాను కొంతవరకు పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది.

### ఇప్పటికీ ముఖ్యమైన స్థానం ఉంది

ఈ పురోగతులు ఉన్నప్పటికీ, డీకంపెన్సేటెడ్ సిర్రోసిస్, తీవ్రమైన కాలేయ వైఫల్యం, కొన్ని రకాల కాలేయ క్యాన్సర్లు లేదా ఇతర చికిత్సలకు స్పందించని తీవ్రమైన కాలేయ వ్యాధి ఉన్న రోగులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రాణరక్షక చికిత్సగా కొనసాగుతోంది.

అందువల్ల తొలిదశలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రతి రోగిలోనూ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరాన్ని పూర్తిగా తొలగించడం లక్ష్యం కాదు. కానీ రోగి ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమయ్యే దశకు చేరకుండా నివారించడం ఒక ముఖ్యమైన లక్ష్యం.

ప్రజలకు ముఖ్యమైన సందేశం కాలేయ వ్యాధి చాలాసార్లు ఎటువంటి లక్షణాలు లేకుండానే కొనసాగుతుంది. కాలేయం గణనీయంగా దెబ్బతిన్నప్పటికీ, వ్యాధి ముదిరే వరకు చాలామందికి ఎలాంటి ప్రత్యేకమైన లక్షణాలు కనిపించకపోవచ్చు.

### అందుకే అవగాహన చాలా ముఖ్యం.

ప్రమాద కారకాలను గుర్తించడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, కాలేయ వ్యాధిని తొలిదశలో గుర్తించడం మరియు దాని మూల కారణానికి సరైన చికిత్స అందించడం ద్వారా వ్యాధి మరింత ముదరకుండా ఆపవచ్చు. కొంత మంది రోగుల్లో ఫైబ్రోసిస్ తగ్గి, కాలేయ పనితీరు కూడా మెరుగుపడవచ్చు.

ఆధునిక నాన్-ఇన్వేసివ్ పరీక్షలు కూడా చాలా మంది రోగుల్లో కాలేయ ఫైబ్రోసిస్‌ను అంచనా వేయడం మరియు కాలక్రమేణా పర్యవేక్షించడం సులభతరం చేశాయి. సిర్రోసిస్ గురించి మన వైద్య అవగాహన ఇప్పుడు మారుతోంది. తీవ్రమైన సిర్రోసిస్‌ను పూర్తిగా నయం చేయవచ్చని చెప్పలేము. అయితే ఫైబ్రోసిస్ ఒక శాశ్వతమైన మార్పు కాకపోవచ్చు. సరైన సమయంలో మూల కారణానికి సమర్థవంతమైన చికిత్స అందించినప్పుడు, కొంత మంది రోగుల్లో ఫైబ్రోసిస్ తగ్గి, కాలేయ పనితీరు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది.

కాలేయ వ్యాధికి సంబంధించిన కారణాలు, వివిధ దశలపై ప్రజల్లో అవగాహన పెంచడం, కాలేయ నష్టాన్ని తొలిదశలో గుర్తించడం, మూల కారణానికి వెంటనే చికిత్స అందించడం ద్వారా కాలేయ వైఫల్యానికి వ్యాధి పురోగతిని నివారించవచ్చు. తద్వారా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరాన్ని తగ్గించడంతో పాటు, అనేక కాలేయ సంబంధిత మరణాలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన కాలేయానికి కూడా శ్రద్ధ అవసరం లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకండి. తొలిదశలో గుర్తించడం ద్వారా కాలేయ వ్యాధి పయనాన్నే మార్చ వచ్చు.




డా. కేఎస్ సోమశేఖర్ రావు

క్లినికల్ డైరెక్టర్ & సీనియర్ కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజీ & హెపటాలజీ విభాగం
యశోద హాస్పిటల్, హైటెక్ సిటీ, హైదరాబాద్

# ఈఎంఐ భారం ఇలా తగ్గించవచ్చు..

ప్రస్తుత కాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు, పర్సనల్ లోన్లు చాలా మందికి భారంగా మారుతున్నాయి. ఇవి కొన్ని అవసరాలకు ఉపయోగపడినప్పటికీ అధిక వడ్డీ కారణంగా ప్రతి నెల చెల్లించే ఈఎంఐలతో అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈఎంఐ భారం తగ్గించే ప్రయత్నం చేస్తోంది ఈ ప్లాట్ ఫాం. ఇది నేరుగా రుణాలు ఇచ్చే సంస్థ కాదు. కానీ ఆర్బీఐలో నమోదైన ఎన్ బీఎఫ్ సీ తో భాగస్వామ్యంకావడంతో వినియోగదారులకు తక్కువ వడ్డీ రేటుతో రీ ఫైనాన్స్ అవకాశాన్ని కల్పిస్తుంది. ఇంతకీ అది ఏ ఫ్లాట్ ఫాం?




రుణం తీసుకునేటప్పుడు భాగానే ఉంటుంది. కానీ ఈఎంఐ చెల్లించేటప్పుడు భారంగా ఉంటుంది. ఈ భారాన్ని bllcut.com ద్వారా తొలగించుకోవచ్చని అంటున్నారు కొందరు ఆర్థిక నిపుణులు. దీని ద్వారా అధిక వడ్డీతో ఉన్న క్రెడిట్ కార్డ్ బకాయిలు లేదా ఇతర రుణాలను తక్కువ వడ్డీ రేటు ఉన్న కొత్త లోన్ లేదా ఈఎంఐ ప్లాన్‌లోకి మార్చే అవకాశాన్ని పరిశీలిస్తుంది. ఉదాహరణకు, ఒక క్రెడిట్ కార్డుపై సంవత్సరానికి 36 నుంచి 48 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్న వినియోగదారుడికి, భాగస్వామ్య NBFCల ద్వారా తక్కువ వడ్డీతో రుణం అవకాశం కల్పిస్తుంది. అదే బకాయిని ఒక స్థిరమైన ఈఎంఐ రూపంలో మార్చే అవకాశం ఉంటుంది.

మొదట BillCut వెబ్‌సైట్ లేదా యాప్‌లో మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోవాలి. అనంతరం పాన్ వంటి వివరాలు ఇచ్చి, క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిశీలించేందుకు వినియోగదారుడు అనుమతి ఇవ్వాలి. ఆ తర్వా త సిబిల్ స్కోర్, ప్రస్తుతం ఉన్న రుణాలు, బకాయిలు, చెల్లింపు చరిత్ర వంటి వివరాలను విశ్లేషించి, అర్హత ఉంటే అందుబాటులో ఉన్న లోన్ లేదా ఈఎంఐ ఆఫర్లను చూపిస్తుంది. వినియోగదారు ఆ ఆఫర్‌ను అంగీకరిస్తే, కొత్త లోన్ ద్వారా పాత అధిక వడ్డీ బకాయిని క్లియర్ చేసి, కొత్త ఈఎంఐ ప్లాన్ ప్రారంభమవుతుంది.

కేవలం క్రెడిట్ కార్డులకే కాకుండా పర్సనల్ లోన్లు, హోమ్ లోన్లు, కార్ లోన్లు వంటి రుణాల భారాన్ని తగ్గించుకునేందుకు దీనిని ఎంపిక చేసుకోవచ్చు. అయితే ప్రతి ఒక్కరూ ఇందులో అర్హత పొందుతారని చెప్పలేం. వినియోగదారుడి క్రెడిట్ స్కోర్, ఇప్పటికే ఉన్న రుణ భారంల ఆధారంగా అర్హత నిర్ణయిస్తారు. అర్హత ఉంటే మాత్రమే తక్కువ వడ్డీతో కొత్త లోన్ ఆఫర్ లభిస్తుంది.

అయితే బిల్ కట్ సేవలు ఉపయోగించే సమయంలో ప్లాట్‌ఫామ్ ఫీజు లేదా ప్రాసెసింగ్ ఛార్జీలు ఉండే అవకాశం ఉంది. అదనంగా, రుణం మంజూరు చేసే ఎన్ బీఎఫ్ సీలు తమ నిబంధనల ప్రకారం ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీలు వసూలు చేయవచ్చు. కాబట్టి ఏ ఆఫర్‌ను అంగీకరించే ముందు వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు, మొత్తం చెల్లించాల్సిన మొత్తం వంటి వివరాలను పరిశీలించాలి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 29.08.2026
www.mudranews.in | @mudranews



**పేగు ఆరోగ్యం ఆహారంతోనే..**



ఆహారంతోనే శాకాహారంలోని పీచు, ప్రొటీన్లను పేగు బ్యాక్టీరియా వివిధ రకాలుగా విచ్ఛిన్నం చేస్తుంది. ఈ ప్రక్రియలో ఏర్పడే జీవక్రియ పదారాలు పేగుల లోపలి గోడను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే సమతుల్య ఆహారం ముఖ్యం

# ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**




**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందని ర్శ రెవెన్యూ, హౌసింగ్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీభవనం– పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50–60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10–15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.గతంలో పేదలకు ఇళ్లు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30–40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు మరియు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు. మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో "పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు.

**పేదల కోసమే ఇందిరమ్మ ఇళ్ళు**
**-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.




**పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు**
**-హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్**

హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేందర్ నగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ గతిని మార్చిన
# పనామా కెనాల్




**(ముద్ర, డెస్క్)**

సముద్రాలు మానవాళికి వాణిజ్యం, అన్వేషణల ద్వారా మేలు చేశాయి. అదే సమయంలో దూరాలు, ప్రమాదాలు, అనారోగ్యాల రూపంలో కష్టాలను కూడా కలిగించాయి. అట్లాంటిక్ నుంచి పసిఫిక్‌కు వెళ్లాలంటే వేల మైళ్లు తిరగాల్సి వచ్చేది. ఈ అవసరం నుంచే పనామా కెనాల్ ఆలోచన పుట్టింది. ఇది కేవలం ఇంజనీరింగ్ విజయం కాదు; వలసవాద ఆశలు, వైఫల్యాలు, భౌగోళిక రాజకీయాలు, మానవ త్యాగాల మిశ్రమం.ప్రారంభ ఆలోచనలు, మొదటి ప్రయత్నాలు1513లో స్పానిష్ అన్వేషకుడు వాస్కో న్యూనెజ్ డి బాల్బోవా పనామా అడవుల్లోకి ప్రవేశించి రెండు సముద్రాల మధ్య సన్నని భూభాగాన్ని గమనించాడు. ఆ ప్రాంతాన్ని కత్తిరిస్తే సులభమైన మార్గం ఏర్పడుతుందని అతను భావించాడు. స్పెయిన్ రాజు చార్లెస్–5 కూడా దీన్ని గుర్తించాడు. అయితే అప్పటి సాంకేతిక పరిజ్ఞానంతో ఇది అసాధ్యమని నిర్ణయం తీసుకున్నారు.తర్వాతి శతాబ్దాల్లో స్కాట్‌లాండ్ ప్రయత్నించింది. రోగాల కారణంగా అది విఫలమైంది. ఆర్థిక నష్టంతో స్కాట్‌లాండ్ బ్రిటన్‌తో విలీనం అయ్యింది. ఈ ప్రమాదకర ప్రాంతం వల్ల దాదాపు రెండు వందల ఏళ్లు ఎవరూ తీవ్రంగా పరిగణించలేదు.సూయజ్ విజయం నుంచి ఫ్రెంచ్ వైఫల్యం వరకు1869లో సూయజ్ కెనాల్ నిర్మాణం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఫెర్డినాండ్ డి లెస్సెప్స్ నాయకత్వంలో యూరప్, ఆసియా మధ్య దూరం గణనీయంగా తగ్గింది. ఈ విజయంతో 1881లో ఫ్రాన్స్ పనామా ప్రాజెక్టును ప్రారంభించింది. కానీ ఈజిప్ట్ ఎడారి కంటే పనామా పూర్తి భిన్నం. కొండలు, అడవులు, భారీ వర్షాలు, మలేరియా, పసుపు జ్వరం వంటి రోగాలు ఉన్నాయి.కొండలు తవ్వినప్పుడు వర్షాలు గుంతలను నింపేవి. రాత్రింబగళ్లు పని చేయించినా 8 ఏళ్లలో సుమారు 30 వేల మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఖర్చులు పెరిగాయి, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. 1889 నాటికి ప్రాజెక్టు సగం కూడా పూర్తికాకుండానే ఆగిపోయింది. ఫ్రాన్స్ ఆర్థికంగా కూడా దెబ్బతిన్నది.అమెరికా ప్రవేశం, నికరాగ్వా ప్రత్యామ్నాయంఫిలిప్ బునో–వరిల్లా అనే ఫ్రెంచ్ ఇంజనీర్ ఆశలు వదలలేదు. లాక్ వ్యవస్థతో కెనాల్ నిర్మించాలని ప్రతిపాదించాడు. అమెరికా వైపు చూశాడు. 1898 స్పానిష్–అమెరికన్ యుద్ధం తర్వాత అమెరికా నావికా శక్తి ప్రాధాన్యతను గుర్తించింది. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి న్యూయార్క్‌కు 22,500 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. నికరాగ్వా మార్గం కూడా పరిగణనలో ఉంది.నికరాగ్వాలో అగ్నిపర్వత విస్ఫోటనం జరిగి వేలాది మంది మరణించిన సందర్భాన్ని బునో–వరిల్లా ఉపయోగించుకున్నాడు. అక్కడి ప్రమాదాలను హైలైట్ చేసి పనామా మార్గాన్ని ప్రోత్సహించాడు. అమెరికా పనామా వైపు మళ్లింది. కానీ అప్పటి కొలంబియా అనుమతి ఇవ్వలేదు. 1903లో అమెరికా మద్దతుతో పనామాలో తిరుగుబాటు జరిగింది. అమెరికా నౌకలు, సైనికులు కొలంబియా సైన్యం చేరకుండా అడ్డుకున్నాయి. ఒక్క రోజులోనే పనామా స్వతంత్ర దేశంగా ప్రకటించబడింది. బునో–వరిల్లా కొత్త దేశానికి ప్రతినిధిగా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కెనాల్ జోన్‌ను అమెరికా నియంత్రణలోకి తీసుకున్నారు. ఏటా అద్దె, మిలిటరీ హక్కులు, అదనపు భూమి తీసుకునే అధికారం కూడా ఇచ్చారు. అమెరికా ఫ్రెంచ్ ఆస్తులను కొనుగోలు చేసింది.1904లో నిర్మాణం మళ్లీ ప్రారంభమైంది. దోమల నియంత్రణ, ఆరోగ్య చర్యలు మొదటి ప్రాధాన్యత అయ్యాయి. గట్టూన్ సరస్సు సృష్టి, లాక్ వ్యవస్థతో పనులు సాగాయి. అనుకున్న సమయం కంటే రెండేళ్ల ముందు 1914లో పూర్తయింది. అయినా సుమారు 5,600 మంది ప్రాణాలు పోయాయి. భౌగోళిక ప్రభావం, నేటి సవాళ్లుపనామా కెనాల్ ప్రపంచ వాణిజ్య మార్గాలను మార్చేసింది. ప్రయాణ సమయం, ఇంధన వ్యయం తగ్గాయి. అమెరికా రెండు సముద్రాలపై ప్రభావం పెంచుకుంది. ఇది జియోపాలిటిక్స్‌లో మలుపు తిప్పింది.నేడు కూడా ఇది కీలకం. చైనా పనామా ప్రాంతంలో పెట్టుబడులు పెంచుతోంది. దీనిపై అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తోంది. 2025లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనాల్‌పై తన నియంత్రణను తిరిగి స్థాపించాలని ప్రస్తావించారు. ఇది గత చరిత్రను గుర్తు చేస్తోంది.పనామా కెనాల్ కథ మానవ సామర్థ్యాన్ని, అదే సమయంలో శక్తి రాజకీయాలను చూపిస్తుంది. సాంకేతిక విజయం వెనుక వేలాది ప్రాణాలు, దేశాల మధ్య అసమాన సంబం ధాలు ఉన్నాయి. ఇది ఇప్పటికీ ప్రపంచ వాణిజ్యం, వ్యూహాత్మక ప్రాధాన్యతలో కేంద్రంగా నిలుస్తోంది.

# కిరాణా హిల్స్ గుట్టు రట్టు..

**(ముద్ర, డెస్క్)**

:పాకిస్తాన్‌లోని సర్గోదా సమీపంలోని కిరాణా హిల్స్ మళ్లీ వార్తల్లోకి వచ్చింది. 2025 మేలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ ప్రాంతం గురించి విస్తృతంగా చర్చ జరిగింది. ఇటీవల మాజీ డిఫెన్స్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో మాట్లాడిన సందర్భంలో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కిరాణా హిల్స్ ఎక్కడుంది..కిరాణా హిల్స్ పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని సర్గోదా జిల్లాలో ఉన్న ఎత్తైన కొండ ప్రాంతం. ఇది పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉంది. చారిత్రకంగా 1980లలో పాకిస్తాన్ ఇక్కడ సబ్‌క్రిటికల్(కోల్డ్) న్యూక్లియర్ టెస్టులు నిర్వహించిందని నివేదికలు ఉన్నాయి. బులెటిన్ ఆఫ్ ది అటామిక్ శాస్త్రవేత్తలు స్వతంత్ర వనరులు ఇక్కడ భూగర్భ నిల్వ సౌకర్యాలు, మ్యూనిషన్స్ స్టోరేజ్ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నాయి. సమీపంలోని ముషాఫ్(సర్గోదా) వైమానిక స్థావరంతో అనుసంధానం ఉందని కూడా చెబుతారు. అయితే ఇక్కడ ప్రస్తుతం న్యూక్లియర్ వార్‌హెడ్‌లు నిల్వ ఉన్నాయని అధికారికంగా నిర్ధారించిన సమాచారం లేదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో .2025 ఏప్రిల్‌లో పహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, కొన్ని సైనిక స్థావరాలపై దాడులు జరిగాయి. సర్గోదా ప్రాంతంలోని వైమానిక స్థావరం కూడా లక్ష్యాల్లో ఒకటి. అప్పుడు సోషల్ మీడియాలో కిరాణా హిల్స్‌పై దాడి జరిగిందని, న్యూక్లియర్ సైట్ దెబ్బతిన్నదని విస్తృత వాదనలు వచ్చాయి. పొగ, పేలుళ్ల వీడియోలు వైరల్ అయ్యాయి. అయితే అప్పటి భారత వైమానిక దళ అధికారి ఎయిర్ మార్షల్ ఏ.కె. భర్తి స్పష్టంగా తిరస్కరించారు. 'మేము కిరాణా హిల్స్‌పై దాడి చేయలేదు. అక్కడ న్యూక్లియర్ ఇన్‌స్టాలేషన్లు ఉన్నాయని మీరు చెప్పినందుకు ధన్యవాదాలు. మాకు తెలియదు.' అంటూ భారత మీడియాకు తెలిపారు.

# పాకిస్తాన్ భయపడుతోంది..
## భారత్ జోలికొస్తే..



**(ముద్ర, డెస్క్)**

ఉద్యమాలను ప్రారంభించడం సులభం. కానీ వాటిని నియంత్రించడం లేదా అంతం చేయడం కష్టం. ఆ తర్వాత ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం మరింత క్లిష్టం. ప్రస్తుతం పాకిస్తాన్ ఎదుర్కొంటున్న పరిస్థితి ఇలాంటిదే. అంతర్గత తిరుగుబాట్లు, సరిహద్దు ఉద్రిక్తతలు, ప్రాంతీయ భద్రతా సమస్యలు దేశాన్ని కుదిపేస్తున్నాయి.అంతర్గత తిరుగుబాట్లు..ఒకవైపు ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రాంతం నుంచి, మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల నుంచి టీటీపీ (తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్) వంటి సమూహాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అదే సమయంలో బలూచిస్తాన్‌లో తిరుగుబాటు ఉద్యమాలు కూడా తీవ్రమవుతున్నాయి. ఈ రెండు వైపుల నుంచి వస్తున్న ఒత్తిడి పాకిస్తాన్ సైన్యం, ప్రభుత్వ వ్యవస్థపై భారీ భారం వేస్తోంది. చరిత్రలో చూస్తే, ఒకప్పటి తూర్పు పాకిస్తాన్ బంగ్లాదేశ్‌గా విడిపోవడానికి అంతర్గత అసంతృప్తి, బాహ్య కారకాలు కలిసి పనిచేశాయి. ఇప్పుడు కూడా ఇలాంటి అంతర్గత విభజనలు పాకిస్తాన్‌ను బలహీనపరుస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.భారత్‌పై ప్రయత్నాలు..పాకిస్తాన్ వైపు నుంచి భారత్‌లో అల్లకల్లోలం సృష్టించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని భారత భద్రతా వర్గాలు పదేపదే హెచ్చరిస్తున్నాయి. భారత్ వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, సరిహద్దు భద్రతను బలోపేతం చేస్తోంది. పాకిస్తాన్ సైన్యం కూడా భారత్‌తో నేరుగా సైనిక వివాదంలో గెలవడం కష్టమని గ్రహించినట్లు కనిపిస్తోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) సమస్య, బలూచిస్తాన్ స్వాతంత్ర్య డిమాండ్లు వంటి అంశాలు రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. అయితే ప్రపంచ దేశాలు ఇలాంటి వివాదాల్లో ఏకపక్షంగా ఏ దేశానికీ మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం.నాయకత్వ సవాళ్లు..ప్రస్తుత పరిస్థితిలో పాకిస్తాన్ సైన్య నాయకత్వం (ముఖ్యంగా జనరల్ ఆసిమ్ మునీర్ నేతృత్వం) వ్యక్తిగత ప్రతిష్ట, రాజకీయ ప్రభావాల కోసం నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి విధానాలు దేశ అంతర్గత స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయని, ఆర్థిక, సామాజిక సమస్యలను మరింత తీవ్రం చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్యమాలు, తిరుగుబాట్లు ఒకసారి మూలాలు పాతుకుంటే వాటిని అణచివేయడం కష్టం. అందుకే దీర్ఘకాలిక పరిష్కారాలు, సంభాషణలు, అభివృద్ధి కేంద్రీకృత విధానాలు అవసరం అని విశ్లేషకులు సూచిస్తున్నారు.మొత్తంగా చూస్తే, పాకిస్తాన్ ఎదుర్కొంటున్న సవాళ్లు కేవలం సైనికమైనవి కావు. అవి రాజకీయ, ఆర్థిక, సామాజిక కోణాలు కలిగి ఉన్నాయి. ఉద్యమాలను నియంత్రించడంలో విఫలమైతే దేశ స్థిరత్వం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ప్రాంతీయ శాంతి, సహకారం మాత్రమే దీర్ఘకాలిక పరిష్కారం కాగలవు.

# అమెరికా, ఇరాన్ యుద్ధం..
## ప్రమాదంలో నాటో రక్షణ వ్యవస్థ

**(ముద్ర, డెస్క్)**



:అగ్రరాజ్యం అమెరికా సైన్యం పశ్చిమాసియాలో ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంపై ఎక్కువగా దృష్టి పెట్టింది. ఈ పరిణామం కేవలం ప్రాంతీయ సమస్యగా మిగలకుండా, యూరప్‌లోని నాటో రక్షణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధునాతన క్షిపణి నిరోధక వ్యవస్థల కొరత, వ్యూహాత్మక వనరుల పునఃపంపిణీ, రష్యా ముప్పు వంటి అంశాలు ఈ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి.తీవ్రమవుతున్న సైనిక ఒత్తిడి..ఇరాన్ నుంచి తరచుగా వచ్చే క్షిపణులు, డ్రోన్ దాడులను ఎదుర్కోవడానికి అమెరికా అధునాతన పేట్రియాట్ వ్యవస్థలను మోహరించింది. అదే సమయంలో గల్ఫ్ మిత్రదేశాలకు కూడా ఈ రక్షణ వ్యవస్థలను సరఫరా చేస్తోంది. యుద్ధం ప్రారంభమై దాదాపు ఆరు నెలలు గడిచిన నేపథ్యంలో, ఇరాన్ ఆయుధాలను అడ్డుకోవడానికి పెద్ద సంఖ్యలో ఇంటర్‌సెప్టర్లు వినియోగించింది. ఇది స్థానికంగా రక్షణ సామర్థ్యాన్ని పెంచినా, వనరులను ఒకే ప్రాంతంపై కేంద్రీకరించడంతో ఇతర ప్రాంతాల్లో లోపాలు ఏర్పడ్డాయి.యూరప్‌లో క్షిపణి నిరోధక కొరతఅమెరికా రక్షణ అధికారులు, నాటో అధికారులు యూరప్‌లో అధునాతన క్షిపణి నిరోధక వ్యవస్థల కొరత అత్యంత తీవ్ర స్థాయికి చేరుకుందని స్పష్టం చేశారు. ఐరోపా ఖండంలోని అమెరికన్, నాటో దళాల వద్ద పేట్రియాట్ నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయి. రష్యా అత్యంత వేగవంతమైన బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోగల ఇంటర్‌సెప్టర్లు సరిపడా లేవని వారు అంగీకరించారు. యూరప్‌లోని అమెరికా సైనిక ప్రముఖులు తమ ప్రభుత్వాన్ని వీలైనంత త్వరగా మిస్సైల్ ఇంటర్‌సెప్టర్లు సరఫరా చేయాలని కోరుతున్నారు.నాటో రక్షణపై సందేహాలు..రష్యా సైన్యం యూరప్‌పై దాడి చేస్తే ప్రస్తుత నిల్వలతో రక్షించడం కష్టమని అధికారులు పరోక్షంగా సూచించారు. సైనిక ప్రధాన కార్యాలయాలు లేదా విద్యుత్ కేంద్రాలపై రష్యా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసిన పక్షంలో, ఉక్రెయిన్‌లో చూసినట్లుగానే నాటో కూడా తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. పేట్రియాట్ వ్యవస్థల కొరత ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతోంది. యూరప్‌లోని క్షిపణి నిల్వలను ఇప్పటికే పశ్చిమాసియాకు తరలించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంక్షోభం..ఇరాన్‌పై యుద్ధం ప్రకటించిన తర్వాత అమెరికా సైన్యం ఇతర ప్రాంతాల్లో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు స్పష్టమవుతోంది. ఒకే సమయంలో రెండు ప్రధాన రంగాల్లో అధునాతన రక్షణ వ్యవస్థలను నిర్వహించడం కష్టతరమైంది. పశ్చిమాసియాలో ఇరాన్ ముప్పును ఎదుర్కోవడానికి వనరులు మళ్లించడంతో యూరప్‌లో రష్యా ముప్పుపై దృష్టి సన్నగిల్లింది. ఇది అమెరికా వ్యూహాత్మక ప్రాధాన్యతల్లో స్పష్టమైన మార్పును సూచిస్తోంది.ప్రస్తుత పరిస్థితి అమెరికా, నాటోకు రెండు ముందున్న సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. పశ్చిమాసియాలో రక్షణను కొనసాగిస్తూనే యూరప్‌లోని నిల్వలను త్వరగా పెంచుకోవాలి. లేనిపక్షంలో ఒక ప్రాంతంలో విజయం సాధించినా మరొక ప్రాంతంలో భద్రతా లోపాలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. రష్యా, ఇరాన్ వంటి ప్రత్యర్థులు ఈ కొరతను ఉపయోగించుకునే అవకాశం కూడా ఉంది. వనరుల సమర్థవంతమైన నిర్వహణ, త్వరిత సరఫరా, స్పష్టమైన ప్రాధాన్యతలు లేకుండా ఈ సంక్షోభం నుంచి బయటపడటం కష్టమే.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 29.08.2026
www.mudranews.in | @mudranews


### పీచు లేకపోతే మొదటికే మోసం

పీచు పదార్థాలు తగ్గిన ఆహారం తీసుకుంటే మంచి బ్యాక్టీరియాకు అవసరమైన ఇంధనం తగ్గిపోతుంది. ఫలితంగా పేగుల రక్షణ పొర దెబ్బతినే అవకాశం పెరుగుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తగినంత పీచు ఉండేలా చూసుకోవడం చాలా అవసరం.



## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు రాఖీ కట్టిన సోదరీమణులు



**ముద్ర, ధర్మపురి న్యూస్ :** రక్షాబంధన్ ను పురస్కరించుకుని ధర్మపురి క్యాంపు కార్యా లయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు స్థానిక కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని మహిళలు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. సోదరీమణుల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు తనకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.

## రోడ్డెక్కిన ఉద్యోగులు.. పెన్షనర్లు



**ముద్ర, కరీంనగర్ :** అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాని జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఐకాస కన్వీనర్ కాళీచరణ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కరీంనగర్‌లో టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పోలీసు సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించారు. రెండో పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్‌లోని 6 డీఏలు, డీఆర్‌లను విడుదల చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులు, పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. నూతన ఎంప్లాయిస్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు 'సర్' నోటీసు



**ముద్ర, కరీంనగర్:** ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నోటీసు వచ్చింది. మంత్రి తండ్రి పేరు తప్పుగా పడడంతో బీఎల్‌వో నోటీసులు ఇచ్చారు. నోటీసులకు స్పందించిన మంత్రి.. తండ్రి పేరు సవరణకు తగిన పత్రాలను బీఎల్‌వోకు అందజేశారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 'ఖేలో తెలంగాణ హాకీ లీగ్' ఫైనల్

**రేపు గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్**

**ముద్ర, హైదరాబాద్ :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహిస్తున్న 'ఖేలో తెలంగాణ హాకీ లీగ్' పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. యువ హాకీ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, తెలంగాణ హాకీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు.

లీగ్ పోటీల్లో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, రాయల్ హాకీ క్లబ్, బీహెచ్ఈఎల్ జట్లు గోల్ లేకుండా డ్రాగా నిలిచాయి. టీజీఆర్జేసీ స్కూల్, బోరబండ జట్టు రాక్‌రోవర్స్ క్లబ్, అంబర్‌పేట్‌పై 1–0తో విజయం సాధించింది. ఏసీ గార్డ్స్ యంగ్ బాయ్స్ జట్టు రాయల్ హాకీ క్లబ్, బీహెచ్ఈఎల్‌పై 5–0తో, గచ్చిబౌలి హాకీ క్లబ్ జట్టు టీజీఆర్జేసీ స్కూల్, బోరబండపై 5–0తో విజయం సాధించాయి. ఏసీ గార్డ్స్ యంగ్ బాయ్స్ జట్టు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌పై 2–1తో, గచ్చిబౌలి హాకీ క్లబ్ జట్టు రాక్‌రోవర్స్ క్లబ్, అంబర్‌పేట్‌పై 5–0తో గెలుపొందాయి.

సెమీఫైనల్స్‌లో గచ్చిబౌలి హాకీ క్లబ్ జట్టు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌పై 2–0తో విజయం సాధించింది. మరో సెమీఫైనల్‌లో ఏసీ గార్డ్స్ యంగ్ బాయ్స్ జట్టు టీజీఆర్జేసీ స్కూల్, బోరబండపై 1–0తో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది.

మూడో స్థానం కోసం జరిగిన పోటీలో టీజీఆర్జేసీ స్కూల్, బోరబండ జట్టు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌పై పెనాల్టీ షూటౌట్‌లో 3–1తో విజయం సాధించింది.

**జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో క్రీడలమంత్రి వా కిటి శ్రీహరి**

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రేపు ఆగస్టు 29న ఉదయం 7:30 గంటలకు గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ దిగ్గజం, భారత మాజీ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి మంత్రి పుష్పాంజలి ఘటించనున్నారు.అనంతరం 'ఖేలో తెలంగాణ హాకీ లీగ్' ఫైనల్ మ్యాచ్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. ఫైనల్‌లో గచ్చిబౌలి హాకీ క్లబ్, ఏసీ గార్డ్స్ యంగ్ బాయ్స్ జట్లు తలపడనున్నాయి.యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం, క్రీడల్లో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, క్షేత్రస్థాయిలో హాకీ క్రీడను అభివృద్ధి చేయడం, తెలంగాణలోని ఔత్సాహిక క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు తగిన వేదిక కల్పించడం ఈ క్రీడా వేడుకల ప్రధాన లక్ష్యమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తెలియజేసింది.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, వెల్గటూర్ న్యూస్ :** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. వెల్గటూర్ మండలం సంకెనపెల్లిలో ఉపాధి హామీ పథకం నిధుల (సుమారు రూ.20 లక్షల)తో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సంకెనపెల్లి అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో ఎకరం ధర రూ.269 కోట్లు..

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు సృష్టించాయి. రాయదుర్గంలో ఎక రం భూమి ధర ఏకంగా రూ.269 కోట్లు పలికింది. రాయదుర్గం సర్వే నంబరు 83/1లోని 5.38 ఎకరాలకు తాజాగా టీజీఐఐసీ వేలం నిర్వహించింది. కనీస ధర రూ.175 కోట్లుగా నిర్ణయిం చింది. రూ.10 కోట్లు ముందస్తుగా చెల్లించి న వారికి ఆన్‌లైన్ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో పలు రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటీపడ్డాయి. చివరికి వంశీరాం బిల్డర్స్ ఎకరానికి రూ.269 కోట్ల చొప్పున 5.38 ఎకరాలను కొనుగోలు చేసింది. దీంతో టీజీఐఐసీ కాసుల పంట పండినట్లైంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.1,447 కోట్లు సమకూరాయి.

## కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మద్యం అక్రమ రవాణా

**ముద్ర, కరీంనగర్ :** ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ముగ్గురు నిందితులతో పాటు వాహనాన్ని మెట్‌పల్లి ఆబ్కారీ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతి కథనం ప్రకారం మహారాష్ట్రలోని బీవండికి చెందిన వ్యాపారి ప్రవీణ్ శ్రీగిరి కేంద్ర పాలిత ప్రాంతాలైన డామన్–డయ్యూ, దాద్రానగర్–హవేలి ప్రాంతాల్లో తక్కువ ధరకు లభించే మద్యాన్ని కొనుగోలు చేసి కొద్ది రోజులుగా తెలంగాణకు తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. కాగా మెట్‌పల్లి ప్రాంతానికి వాహనంలో తరలిస్తున్నారనే సమాచారంతో ఆబ్కారీ సీఐ వినోద్‌రాథోడ్ బుధవారం అర్ధరాత్రి నుంచి సిబ్బందితో కలిసి కథలాపూర్ మండలం తాండ్రియాల క్రాస్‌రోడ్ వద్ద నిఘా పెట్టారు. గురువారం ఉదయం 6.30 గం.ల సమయంలో వచ్చిన వాహనాన్ని తనిఖీ చేశారు. పైకి చూస్తే మొత్తం ఖాళీగా కనిపించినా అనుమానంతో క్షుణ్ణంగా తనిఖీ చేయగా ప్రత్యేకంగా తయారు చేసిన ఇనుప డబ్బాల్లో మద్యం సీసాలుంచినట్లు గుర్తించారు. 45 పెట్టెల్లో 180 ఎంఎల్ సీసాలు, 25 ఫుల్ బాటిళ్ల పెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో వీటి విలువ రూ.2.85 లక్షలుండగా, తెలంగాణలో రూ.6.40 లక్షలుగా ఉంటుందని అధికారి తెలిపారు. అక్రమ మద్యంతో పాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారి ప్రవీణ్ శ్రీగిరితో పాటు ప్రదీప్ జైశ్వాల్, అజయ్ బక్వాన్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మెట్‌పల్లి అధికారులు, సిబ్బందిని జిల్లా అధికారి అభినందించారు.



# భగవత్ అమెరికా పర్యటనకు అభ్యంతరాలు ఉన్నా వెళ్లారు..

**- రేవంత్‌కు మాత్రం క్లియరెన్స్ ఎందుకు నిరాకరణ?**
**- మమ్దానీతో భేటీనే కారణమా?.. కేంద్ర నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో చర్చ**






**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం రాజకీయ అనుమతి (Political Clearance) నిరాకరించడం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వని కేంద్రం.. ఆయన UK పర్యటనకు మాత్రం క్లియరెన్స్ ఇచ్చింది. అమెరికా పర్యటనకు ప్రతిపాదించిన కార్యక్రమం ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా లేదని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) కారణం తెలిపినట్లు సమాచారం.

అయితే ఈ నిర్ణయంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా RSS అధినేత మోహన్ భగవత్ అమెరికా పర్యటనతో రేవంత్ రెడ్డి పర్యటనను పోల్చుతూ కాంగ్రెస్ వర్గాలు, రాజకీయ విశ్లేషకులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

మోహన్ భగవత్ అమెరికా పర్యటనను అమెరికా ప్రభుత్వం అధికారికంగా నిషేధించినట్లు ఆధారం లేదు. అయితే అమెరికా మత స్వేచ్ఛ కమిషన్ (USCIRF) ఆయన వీసాను రద్దు చేయాలని కోరింది. అలాగే న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ కూడా భగవత్ కార్యక్రమాన్ని వ్యతిరేకించినట్లు వార్తలు వచ్చాయి. అయినప్పటికీ భగవత్ న్యూయార్క్ చేరుకున్నారు.

ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విషయంలో కేంద్రం వైఖరి భిన్నంగా ఉండటంపై ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రేవంత్ ప్రతిపాదిత అమెరికా పర్యటనలో పెట్టుబడులు, తెలంగాణ అభివృద్ధి, విద్యా సంస్థలు తదితర అంశాలకు సంబంధించిన కార్యక్రమాలతో పాటు న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీతో భేటీకి అవకాశం ఉన్నట్లు itineraryలో కనిపించినట్లు సమాచారం.

అయితే రేవంత్ రెడ్డి కార్యాలయం మాత్రం మమ్దానీతో భేటీ కేవలం 'tentative' మాత్రమేనని, దీనిపై అధికారికంగా ఎలాంటి కమ్యూనికేషన్ జరగలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

**మమ్దానీతో భేటీపై అభ్యంతరం ఎందుకు?**

ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతోంది. న్యూయార్క్ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న మేయర్ జొహ్రాన్ మమ్దానీని ఒక భారత రాష్ట్ర ముఖ్యమంత్రి కలవడంలో అభ్యంతరం ఏమిటన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. మమ్దానీని కలవడం భారతదేశ ప్రయోజనాలకు ఎలా విరుద్ధమవుతుందన్న దానిపై కూడా స్పష్టత కోరుతున్నారు.

కేంద్రం 'కార్యక్రమం తగినది కాదు' అనే సాధారణ కారణం చెప్పడం కాకుండా.. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఏ కార్యక్రమం ముఖ్యమంత్రి హోదాకు తగినది కాదని భావించిందో, దానికి కారణం ఏమిటో స్పష్టంగా వెల్లడించాలని విమర్శకులు డిమాండ్ చేస్తున్నారు.

**సమాఖ్య స్ఫూర్తిపై ప్రశ్నలు**

ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పెట్టుబడులను ఆకర్షించేందుకు, అంతర్జాతీయ సంస్థలతో సమావేశాలు నిర్వహించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చించేందుకు విదేశీ పర్యటన చేపట్టాలనుకున్నప్పుడు కేంద్ర అనుమతి అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో అమెరికా పర్యటనకు రాజకీయ క్లియరెన్స్ నిరాకరించడం సమాఖ్య స్ఫూర్తికి అనుగుణమేనా? అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది.

ఇదంతా చూస్తుంటే రాజకీయంగా మరో ప్రశ్న ముందుకొస్తోంది. భగవత్ అమెరికా వెళ్లడాన్ని అడ్డుకోలేని కేంద్రం.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు ఎందుకు అనుమతి నిరాకరించింది? మమ్దానీతో భేటీ ప్రతిపాదనే కారణమైతే.. ఆయనను కలవడంపై కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? అన్నదే ఇప్పుడు చర్చగా మారింది.

అయితే రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను కేంద్రం నిరాకరించడానికి మమ్దానీతో భేటీనే కారణమని నిర్ధారించే అధికారిక ఆధారం ప్రస్తుతం బయటకు రాలేదు. అందువల్ల ఈ అంశంపై స్పష్టత రావాలంటే కేంద్రం మరింత వివరంగా కారణాలను వెల్లడించాల్సి ఉంటుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ధర్మపురి తీసుకెళ్లి చిన్నారుల ఆకాంక్ష నెరవేర్చిన జడ్జి

ముద్ర, జగిత్యాల న్యూస్ : జగిత్యాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు బాలసదన్ చిన్నారుల పట్ల ప్రత్యేక అభిమానం ప్రదర్శిస్తూ వారి ఆకాంక్షను నెరవేర్చారు. ఆయన తరుచుగా జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను సందర్శించి వారి యోగ క్షేమాలను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు 1న అక్కడకు వెళ్లిన సందర్భంలో చిన్నారులు తమకు ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని, గోదావరిని దర్శించాలనే కోరిక ఉందని జడ్జితో చెప్పారు. స్పందించిన ఆయన తన భార్య, ఇద్దరు పిల్లలతో పాటు బాలసదన్‌కు చెందిన 13 మంది చిన్నారులను తీసుకొని గురువారం ఉదయం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పర్యాటక ప్రదేశాల గురించి, చారిత్రక విశేషాలను సవివరంగా పిల్లలకు వివరించారు. గోదావరి తీరంలో వారితో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. వారు అనాథలు కాదని.. తమ పిల్లలనే భావనతోనే తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించానన్నారు. త్వరలోనే శ్రీహరి కోటను కూడా సందర్శిస్తామన్నారు. వారికి జగిత్యాలలో అన్ని వసతులతో శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తామున్నామంటూ వారికి భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీఐ రామ్ నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



## కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోండి



కూరగాయలు, పండ్లలో పీచుతో పాటు వృక్ష రసాయనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కణాలను రక్షించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో, వాపు ప్రక్రియలను నియంత్రించడంలో సహాయపడే సమ్మేళనాల ఉత్పత్తికి దోహదం చేస్తాయి.

# భక్తి శ్రద్ధలతో మహా గాయత్రి యజ్ఞం

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు కుండముల గాయత్రి యజ్ఞం, యజ్ఞోపవీతం, రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరు చంద్రమౌళి మాట్లాడుతూ ప్రతిరోజు గాయత్రి జపం చేయడం వలన మంచి జరుగుతుందన్నారు. యజ్ఞోపవీత కార్యక్రమంలో భాగంగా మొదటి దారంలోని మొదటి పోగులో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, రెండవ పోగులో సరస్వతీ, లక్ష్మి, పార్వతి మూడవ పోగులో తల్లి,





తండ్రి, గురువుగా భావిస్తారు అన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని సూచించారు. రక్షాబంధన్ తో అక్క తమ్ముడు అన్న చెల్లెలు బంధమే కాకుండా దేశ రక్షణకు కూడా పాటుపడాలన్నారు. సన్మార్గంలో ప్రజలు నడిచే పలు సూచనలు చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంతో ఆలయంలో పండగ వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, నీల విజయకుమార్, నూతనగంటి జగన్, గాజుల కుశాల్, వింజమూరు చంద్రమౌళి, దుర్గయ్య, ఓంకారం, మారం వెంకటేశ్వర్లు, శ్రీహరి గోపాల చారి, నారాయణ, నాగార్జున రెడ్డి, రవి, సత్యనారాయణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

**మోత్కూర్ లో ..**

**ముద్ర, మోత్కూర్:** శివ భక్త మార్కండేయ ఆలయంలో రాఖీ పండుగ (నూలు పౌర్ణమి) సందర్భంగా పద్మ బ్రాహ్మణులు మహేశ్వరం నాగరాజు ఆధ్వర్యంలో గాయత్రీ ధారణ కార్యక్రమం నిర్వహించారు. పూజా సామాగ్రి దాత మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచం జగన్ ఆధ్వర్యంలో పూజా సామాగ్రి అందజేశారు. పద్మశాలి కుల బాంధవులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 22ఏ భూముల పరిష్కారంలో పారదర్శకత వహించాలి

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 22ఏ జాబితాలోని ప్రతి సర్వే నంబర్‌ను రెవెన్యూ రికార్డులతో పూర్తి స్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని స్పష్టం చేశారు. పొరపాటున ప్రైవేట్ భూములు నిషేధిత జాబితాలో చేరితే, వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి 48 గంటల్లోగా సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రైవేట్ భూములను తొలగించే ప్రక్రియలో ప్రతి సర్వే



నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, రిమార్క్స్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.గతంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కొన్ని సమస్యలు తలెత్తేవని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణల ద్వారా రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. నిషేధిత భూములను ఐదు కేటగిరీలుగా వర్గీకరించి, విచారణ వేగవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా ఒకే విధమైన ఫార్మాట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. నిజమైన భూ యజమానులకు న్యాయం చేస్తూనే, ప్రభుత్వ భూములను కాజేసేందుకు ప్రయత్నించే అక్రమార్కుల పట్ల కఠినంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడేది లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి ఆధారాలు పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## తుంగతుర్తిలో 30న ఉచిత కంటి వైద్య శిబిరం



**ముద్ర, తుంగతుర్తి:** మండల కేంద్రంలో ఈనెల 30వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అక్షర ఫౌండేషన్ – సూర్యాపేట, శంకర కంటి ఆసుపత్రి – హైదరాబాద్ ఆధ్వర్యంలో, స్వర్గీయ సంకినేని కమలమ్మ – రామారావుల జ్ఞాపకార్థం, ఎస్.కె.ఆర్. కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం తుంగతుర్తిలో సంకినేని రవీందర్ రావు, తుంగతుర్తి గ్రామ సర్పంచ్ సాయిబాబు ఆవిష్కరించారు.

## సీఎంకు రాఖీ..



**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె మంతుల విమల వెంటేశ్వర్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగాల సత్యనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి మోత్కూర్ 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, పొడిచేడు సర్పంచ్ సైదులు, అనాజీపూర్ సర్పంచి వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సమీరుద్దీన్, ఘనగాని నరసింహ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, కిరణ్, మహమ్మద్ షాకిరుద్దీన్, శ్రావణ్, రాహుల్, రామన రసయ్య, సోమయ్య పాల్గొన్నారు.

**ఎంపీకి ఘన స్వాగతం**



అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాలువ గ్రామంలో ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వల్లంబట్ల వేణు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి మోత్కూర్‌లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోత్కూర్ 12వ వార్డు కౌన్సిలర్ మెంట రమణ నగేష్, రెండవ వార్డు కౌన్సిలర్ కుర్మిళ్ల ప్రమీల ఎంపీకి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# రక్షాబంధన్ వేడుకలు

**ముద్ర, తుంగతుర్తి :** రాఖీ పౌర్ణమి పండుగ అత్యంత ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రాఖీ దుకాణాలు, స్వీట్ షాపులు ఉదయం నుంచే మహిళలతో కిటకిటలాడాయి. రంగురంగుల రాఖీల కోసం, మిఠాయిల కోసం మహిళలు బారులు తీరారు. పట్టణంలో ఎక్కడ చూసినా మహిళల సందడి కనిపించింది. సుదూర ప్రాంతాల నుంచి తమ పుట్టింటికి వచ్చి అన్నలకు రాఖీలు కట్టడానికి చెల్లెళ్లు తరలిరావడంతో తుంగతుర్తి పట్టణం కళకళలాడింది. ఏ ఇంట్లో చూసినా రాఖీ పండుగ సందడే నెలకొంది. అన్నల చేతులకు రంగురంగుల రాఖీలు కట్టి, నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి చెల్లెళ్లు తమ ప్రేమను చాటుకున్నారు. అన్నదమ్ములు తమ చెల్లెళ్లను ఆశీర్వదించి కానుకలు అందజేశారు.ప్రతి ఇంట్లో పిండి వంటలతో, మిఠాయిల పంపిణీతో గ్రామసీమలు గుమగుమలాడాయి. చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా పండుగలో పాల్గొన్నారు.

**ముద్ర, దేవరకొండ:** అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ పండుగను కొండ మల్లేపల్లిలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా, సంబరంగా జరుపుకున్నారు.ఇంటి ఆవరణలో జరిగిన ఈ వేడుకలో చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. చేతికి రంగు రంగుల రాఖీలు కట్టుకుని, కొత్త బట్టలు ధరించి చిన్నారులు ఎంతో మురిసిపోయారు. చిన్నారుల కేరింతలతో ఇల్లంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కుటుంబ పెద్దలు మాట్లాడుతూ.. రక్షా బంధన్ అనేది కేవలం పండుగ మాత్రమే కాదు, ఇది జీవితాంతం ఒకరికొకరు తోడుగా ఉంటామనే భరోసా. నేటి తరం చిన్నారులలో ఇలాంటి సంప్రదాయ విలువలను పెంపొందించడం ఎంతో అవసరం అని తెలిపారు

**ఎస్‌హెచ్‌ఓకు రాఖీ**

**ముద్ర, తుర్కపల్లి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆత్మీయంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రాహింపురం గ్రామానికి చెందిన ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ దండ్ల అజయ్ సతీమణి దండ్ల నాగరాణి, తుర్కపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎం. శివకృష్ణకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సోదర–సోదరీమణుల ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీక అని, మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

**దాచారంలో..**

**ముద్ర, మోత్కూర్:** సోదర భావాన్ని పెంపొందించడం కోసమే రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకుంటారని మండలంలోని దాచారం గ్రామ సర్పంచ్ కర్నె జ్యోతి వీరేశం అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆమె తమ యొక్క సోదరులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలతోపాటు దాచారం గ్రామ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ









దృష్టికి తీసుకురావాలని దాచారం గ్రామం ప్రజలకు సూచించారు. జిల్లాలో నే దాచారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆమె తెలిపారు.

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే బాలు నాయక్**



**ముద్ర, దేవరకొండ:** పవిత్రమైన రాఖీ పౌర్ణమి రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీకగా జరుపుకునే పండుగ అని అన్నారు. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను కోరుకోవడం, సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అం డగా ఉంటానని భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లను గౌరవిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని సోదరీమణులు తమ సోదరుల అభివృద్ధి, ఆయురారోగ్యాల కోసం ఆకాంక్షించాలని కోరారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు ప్రేమ, ఐక్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయ న్నారు

## నలుగురు ఎస్ఐలు బదిలీ

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఎస్ఐ లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కె. షాకీర్ ను మహబూబాబాద్ జిల్లా నుండి వి.ఎం. బంజార పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒగా, వీఆర్‌లో ఉన్న ప్రదీప్ ను వేంసూర్ కు , వి.ఎం. బంజార పీఎస్ ఎస్హెచ్ఒ గా ఉన్న వెంకటేష్ ను ఖానాపురం హవేలీ పీఎస్‌కు , ఖానాపురం హవేలీ పీఎస్‌లో పనిచేస్తున్న మధుబాబు ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

## పెంపుడు కుక్కను కాల్చిచంపిన రిటైర్డ్ ఆర్మీ జవాన్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ రౌతు జానయ్య ఒక మూగజీవి పట్ల క్రూరంగా ప్రవర్తించాడు. తన ఇంటికి ఎదురుగా నివసించే రాము అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క ప్రతిరోజూ తన ఇంటి వద్దకు వస్తోందన్న నెపంతో తీవ్ర ఆగ్రహానికి గురైన జానయ్య, ఎయిర్ గన్ తో దానిపై దాడి చేసి అక్కడికక్కడే కాల్చిచంపాడు.ఇంటి సభ్యుడిలా చూసుకుంటున్న పెంపుడు కుక్కను ఏ తప్పూ చేయకపోయినా దారుణంగా కాల్చి చంపడంతో యజమాని రాము తీవ్ర తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఆయన ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ ఆర్మీ జవాన్‌పై ఫిర్యాదు చేశాడు. ప్రాణాలు కాపాడాల్సిన పూర్వ మిలిటరీ ఉద్యోగి ఇలా ఒక చిన్న కారణానికే మూగజీవిపై గన్ తో దాడికి తెగబడటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు.

## స్మార్ట్ కిడ్జ్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను అత్యంత ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బాలురకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి తమ సోదరప్రేమను చాటుకున్నారు. అంతేకాకుండా పాఠశాల ఆవరణలోని చెట్లకు, ఆయాలు, వాచ్‌మెన్, డ్రైవర్లు, ఫోటోగ్రాఫర్లకు కూడా విద్యార్థులు రాఖీలు కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థులలో సోదరభావం, మానవీయ విలువలు పెంపొందించేందుకే ఈ వేడుకలు నిర్వహించామని తెలిపారు. రాఖీ కేవలం దారం కాదని, ప్రేమ, నమ్మకానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలిమ కుటుంబానికి ఎంపీ ఆర్థికసాయం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని బాగాయత్ స్కూల్ లో చెట్టు కూలి చనిపోయిన అలిమ కుటుంబానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ జనరల్ సెక్రటరీ పోత్నాక్ ప్రమోద్ కుమార్, పీసీసీ డెలిగేట్ తంగెళ్లపల్లి రవి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, గ్రంధాలయ చైర్మన్ అవేస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు లయిక్ అహ్మద్, బింగి నరేష్, నర్సింగ్ రావు, చీమల రాజు, సుమయ్య తబస్సుమ్ శఫీక్ అహ్మద్, తహెరా బబ్లు, నజియా రెహమాన్, ఈరపాక నర్సింహా, కోఆప్షన్ సుజాయత్ అలీ కౌసర్, సేవాదళ్ నాయకులు పిట్టల బాలరాజ్, పులిగిల్ల బాలయ్య, కాంగ్రెస్ నాయకులు అతహర్, హిరేకార్ శ్రీనివాస్, మన్సూర్ పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** ఈ నెల 30 న ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న నీట్ పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు 163వ సెక్షన్ అమలులో ఉంటుందని వెల్లడించారు.ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు రెండు వందల మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడరాదని సూచించారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జీరాక్స్ సెంటర్లు, కంప్యూటర్ సెంటర్లు, పుస్తక దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, కేంద్రాల పరిసరాల్లో పటిష్ట బందోబస్తుతో పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## బసవరాజు శ్రీనివాస్‌పై కవిత వ్యాఖ్యలు విడ్డూరం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్‌లపై తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత అనవసర నీలాపనిందలు వేయడం తగదని ఖమ్మం అర్బన్ జిల్లా కార్పొరేషన్ ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ సంఘ నాయకులు కోసూరి ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. సంజీవరెడ్డి భవన్‌లో బ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోసూరి మాట్లాడుతూ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌పై కవిత చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ స్వగ్రామం ఖమ్మం జిల్లా, చోపకట్లపాలెం అని ఆయన విద్యాభ్యాసమంతా తెలంగాణలోనే సాగిందని స్పష్టం చేశారు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్‌ను పరిశీలించకుండా చదవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా ఎంతో అనుభవం ఉన్న కవితమ్మ నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బసవరాజు శ్రీనివాస్ పక్కా తెలంగాణ వాసి అని ఆయనకు సంబంధించిన ఎలాంటి ఆధారాలైనా ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన ఎస్సీ ఆడపడుచులను విమర్శించారని అనడం పూర్తిగా అసత్యమన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘ నాయకులు వనం కృష్ణవేణి, శ్రీనివాస్, చక్రధర్ రావు, డాక్టర్ ప్రభాకర్ రావు, ప్రసాద్, సంతోష్, రాంగోపాల్, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ అమరుల పోరాట స్ఫూర్తితో ముందుకు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 28 :** బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల 26వ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని రామకృష్ణ స్థూపం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ (ఎం.ఎల్.) మాస్లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సి.వై. పుల్లయ్య పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల పరిధిలోని విద్యుత్ రంగాన్ని చేతుల్లోకి తీసుకుంటూ సంస్కరణల పేరిట భారం మోపుతోందని, ఆర్డినెన్స్ ద్వారా స్మార్ట్ మీటర్లను తెచ్చి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. జీఎస్టీ పేరుతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీశారని విమర్శించారు. నాయకులు దండి సురేష్, జానిమియా, శింగు నర్సింహారావు, పోన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, పోటు కళావతి, మేకల శ్రీనివాస్, ఆవుల అశోక్, రామయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 29.08.2026
www.mudranews.in | @mudranews



## పీచు పదార్థాలు తప్పనిసరి



ఆరోగ్యకరమైన పేగుల కోసం రోజువారీ ఆహారంలో తగినంత పీచు ఉండాలి. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, సంపూర్ణ ధాన్యాలు వంటి వాటిని తీసుకోవడం వల్ల పేగుల్లోని మంచి బ్యాక్టీరియాకు అవసరమైన ఆహారం అందుతుంది.

# ఘనంగా రక్షా బంధన్ వేడుకలు















**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా వ్యాప్తంగా రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోదర, సోదరీమణుల అనురాగం, ఆప్యాయతకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకున్నారు. ఎక్కడో ఉన్న తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు తోబొట్టువులు రావడం అన్నావాయితీ. రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోట్ పోలీసులు విధుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తుండగా ఓ మహిళా సోదరి పోలీసులకు రాఖీ కట్టి అభిమానం చాటుకున్న సంఘటన పాపన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సమాజంలో పోలీసుల పాత్ర పెద్దన్న వంటిదని ఆమె పేర్కొన్నారు. మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర పనులకు వెళ్తున్నారని, వారు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకమే కారణమని అన్నారు.చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ అంటూ పోలీసులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.పండగ రోజు కూడా కుటుంబాలకు దూరంగా విధుల్లో ఉంటూ ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్న బ్లూకోట్ సిబ్బంది సేవలను ఆమె అభినందించారు. రాఖీ పండుగను పురస్కరించుకుని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ కు ఆయన సోదరీలు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### కూకట్‌పల్లిలో..

**ముద్ర, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలో రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలను అత్యంత వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన మహిళలు రాజకీయ నాయకులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసంలో మహిళలు ఆయనకు రాఖీలు కట్టారు. అలాగే, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ కి మహిళా నాయకురాళ్లు రాఖీలు కట్టారు.ఈ రెండు వేడుకలలోనూ నాయకులు మహిళలకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతి ఇంటా ఆనందం, సుఖశాంతులు వెల్లివిరియాలని కోరారు.

**ముద్ర, చేవెళ్ల:** అన్న చెలెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ ను శుక్రవారం నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీమణులు సోదరులకు రాకీలు కట్టి మిఠాయి లు తినిపించారు. ఆశీర్వదం తీసుకున్నారు.మండల కేంద్రాలలో రాఖీలు, మిఠాయి దుకాణాలు కిక్కిరికి పోయాయి.రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ రాఖిపౌర్ణమి సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవిన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ మధుయాస్కి గౌడ్ లకు రాఖీలు కట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రక్షణగా నిలుస్తుంది అన్నారు. మహిళలను ఆర్థికంగా ముందుకు నడిపించేందుకు అనేక సంక్షేమ పథకాలను ఆమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ దే అన్ని అన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శ్రావణ మాస శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మ వారికి నిత్యార్చనలు పూర్తి అయిన తరువాత, నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు చీరతో దివ్యాభరణాలతో పుష్ప మాలికలతో అలంకరించి అష్టలక్ష్మి మంటపంలో కొలువుదీర్చారు.. అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హావనం నిర్వహించారు. సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.

## 20.360 కిలోల గంజాయి పట్టివేత



### ఇద్దరు నిందితుల అరెస్ట్





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** అక్రమంగా 20.360 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షలో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో ఈగల్ ఫోర్స్ సహకారంతో పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుండి 20.360 కిలోల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ఫ్రాంక్స్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. కృష్ణమాల్ కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి ఎన్‌హెచ్–65 హైదరాబాద్ రోడ్డులోని చౌటుప్పల్ విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో ఓడీ–02–డీఎస్–897 నంబర్ గల ఫ్రాంక్స్ కారును అనుమానంతో ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనం వెనుక భాగంలోని డిక్కీలో గోధుమరంగు టేపుతో చుట్టిన ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు.ప్యాకెట్లను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 20 ప్యాకెట్లలో 20.360 కిలోల గంజాయి ఉన్నట్లు తూకం వేసి నిర్ధారించారు. ఒడిశా రాష్ట్రంకు చెందిన త్రిలోచన్ సామంత్రా, సాగర్‌బాల్ లను అరెస్టు చేశారు.నిందితులపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసి, ఇద్దరినీ అరెస్ట్ చేసి అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు.

## పేదల సొంతింటి కల సాకారం కాంగ్రెస్ తోనే సాధ్యం

### కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్

**ముద్ర, చేవెళ్ల:** పేదల సొంత ఇంటి కల సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ది అని చేవెళ్ళ కాంగ్రెస్ ఇంచార్జి భీమ్ భరత్ అన్నారు. నవాబుపేట మండలం ఎల్లకొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన శుక్రవారం ప్రారంభించారు గ్రామంలో ఇటీవల మృతి చెందిన వార్డ్ సభ్యురాలు, మరో కాంగ్రెస్ కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, నాయకులు కొండల్ యాదవ్, వెంకట్ రెడ్డి, వెంకటయ్య, ప్రభాకర్, నర్సింలు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో 'టాస్' ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు

### మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో2026–27 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని తాండూర్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారు గతంలో ఫెయిల్ అయిన అభ్యర్థులు విద్యాసంవత్సరాన్ని నష్టపోకుండా ఉండేందుకు ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఆగస్టు 31, 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బడి మానివేసిన వారు ప్రైవేట్ అభ్యర్థులు ఉద్యోగులు ఎవరైనా అర్హులే 2026 ఆగస్టు 31 నాటికి పదవ తరగతి కనీసం 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్ కు 15 సంవత్సరాలు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు. ఇప్పుడు చేరిన వారికి ఏప్రిల్ 2027 లో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సర్టిఫికెట్లు రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా పై చదువులకు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు పూర్తిగా చెల్లుబాటు అవుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు తాండూర్ మున్సిపాలిటీ MEPMA సిబ్బందిని, సమీపంలోని మీ సేవ కేంద్రాలను లేదా అధికారిక వెబ్ సైట్ ను సంప్రదించి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అడ్మిషన్లు ఉచిత పాఠ్య పుస్తకాల వివరాల కోసం మండల పరిధిలోని TOSS స్టడీ సెంటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించవచ్చని మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి తెలిపారు.

## సి. కళ్యాణ్‌కు ఘన సన్మానం



**ముద్ర, హైదరాబాద్:** తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీ సి. కళ్యాణ్‌ను ఫిల్మ్ నగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ శ్రీ కాజా సూర్యనారాయణ ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సి. కళ్యాణ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి సి. కళ్యాణ్ మరింత కృషి చేయాలని కాజా సూర్యనారాయణ ఆకాంక్షించారు.

## ముస్లిం సోదరునికి రాఖీ కట్టిన మాజీ చైర్‌పర్సన్



**ముద్ర ప్రతినిధి, తాండూర్ :** కుల మతాలకతీతంగా హిందూ ముస్లిం తారతమ్యం లేకుండా అందరూ ఒకటేనని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి వెంకటయ్య ముస్లిం సోదరుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సాజిద్ అలీకి రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. ప్రతి ఏడాది రక్షాబంధన్ సందర్భంగా సాజిద్ అలీకి కోట్రిక విజయలక్ష్మి రాఖీ కడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రక్షాబంధన్ పండగ సందర్భంగా సాజిద్ అలీ కోట్రిక విజయలక్ష్మి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి పండగ సంప్రదాయాన్ని పాటిస్తూ సాజిద్ అలీకి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాజిద్ అలీకి మొక్కను బహుకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ పండగ అందరికీ సమానమేనని అన్నారు. మతాలకు అతీతంగా ప్రేమ, ఆప్యాయతలు పంచుకోవడం ద్వారా సమాజంలో సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## రక్షాబంధన్ ప్రేమానురాగాలకు ప్రతీక

### బండారు దత్తాత్రేయ





**ముద్ర, హైదరాబాద్:** మహిళా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి హైదరాబాద్ రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ గవర్నర్, బీజేపీ నేత బండారు దత్తాత్రేయ రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ సోదర–సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, హైదరాబాద్ నగర మాజీ మేయర్ బండారు కార్తిక రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కేతినేని సరళ, మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, బీజేపీ జాతీయ నాయకురాలు అరుణ జ్యోతి, మాజీ కార్పొరేటర్ మంత్రి కళావతి, భైరి అమరావతి, శోభ, మాధవి, జ్యోతి తదితర మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, బ్రహ్మకుమారీలు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# పైన పటారం.. లోన లొటారం

**ఇది డబల్ బెడ్ రూముల తీరు..**
**సింగన్నగూడెం వద్ద డబుల్ బెడ్ రూమ్ లు ఒకేసారి లబ్ధిదారులకు ఇవ్వాలి**
**సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ**




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పైన పటార.. లోన లొటారం అన్నట్లుగా డబల్ బెడ్ రూములు ఉన్నాయని,సింగన్నగూడెం వద్ద డబుల్ బెడ్ రూమ్ లు ఒకేసారి లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం డబల్ బెడ్ రూమ్ లను పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఏది రిపేరు చేయకుండా బయట రంగులు వేసి మాత్రమే లోనలుటారం పైన పటారం ఉన్నవి 444 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రభుత్వ అధికారులైన కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వో సమక్షంలో అర్హత గల లబ్ధిదారుల నుండి లాటరీ పద్ధతిలో ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చిన లబ్ధిదారుల మీద కూడా రెండు మూడు సార్లు ఎంక్వయిరీ చేసి వారికి పట్టాలు ఇవ్వడం జరిగిందని కానీ ఇప్పుడు ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుత లబ్ధిదారుల నుండి కొంతమందిని తీసివేసి కొత్త వారికి ఇస్తామని ఈ మధ్యకాలంలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంక్వయిరీ పేరిట ఎప్పుడో 10 సంవత్సరాల క్రితం ప్లాటు కొనుక్కొని అమ్మివేసినా దానిని సాకుగా చూపిస్తు, కులవృత్తుల పేరిట గత ప్రభుత్వంలో వారి పేరు మీద మీటర్ ఉంటే ఫ్రీ కరెంటు ఇవ్వగా మీకు మీటర్ ఉందంటే ఇల్లు ఉన్నట్టే అని చెప్పి వారిని కూడా అనర్హులుగా చూపడానికి కారణాలు వెతుకుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ సెక్రటేరియట్ సభ్యులు గంధ మల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, వనం రాజు, పట్టణ నాయకులు వల్లాస్ అంజయ్య, కొలుపుల కృష్ణ, ఎనబోయిన లింగం, నరాల నరసింహ, మన్నె రాజు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555